# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 3 BI MONTHLY FOR PRIVATE CIRCULATION ONLY JAN - FEB : 2005

# బడ్జెట్ ఫలాలు దళితులకు అందని ద్రాక్షలేనా ?



# దళితులు - బడ్జెట్

...✍ శిరివెళ్ళ ప్రసాద్

త్వరలో 2005-06 సం॥రపు బడ్జెట్ మన ముందుకు రాబోతుంది. ఈ బడ్జెట్ స్థూల ఆర్థికవిధానాలని, బలహీనవర్గాల అభివృద్ధిని వారి జీవన విధానాల్ని ప్రభావితం చేసే అనేక పథకాలకు ఆర్థిక సామాజికాభివృద్ధి కోసం ప్రభుత్వం కొనసాగించాలనుకుంటున్న విధివిధానాలకు ప్రతీక. కానీ బడ్జెట్‌పై జరిగే చర్చలు ఎప్పుడూ సామాన్య ప్రజానీకానికి దూరంగానే ఉంటున్నాయి. బడ్జెట్ రూపకల్పనలో వాణిజ్య సంస్థల ప్రతినిధులతో పారిశ్రామికవేత్తలతో బ్యాంకుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపడం మనం చూస్తూనే ఉన్నాం. ఆర్థిక సామాజికాభివృద్ధిని ప్రతిబింబించే ఈ ప్రక్రియలో ప్రజా సంఘాలను కానీ, స్వచ్ఛంధ సంస్థలను కానీ భాగస్వాములను చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్ రూపొందించిన పిదప శాసనసభలో ప్రవేశపెట్టేముందు సంక్షిప్త వివరాలతో ప్రజల ముందుంచడం మాత్రమే జరుగుతుంది. బడ్జెట్ రూపకల్పన విధాన ప్రక్రియ సమాజంలో నెలకొని వున్న అధికార సంబంధాలను తెలియపరుస్తాయి. అంతేకాక ప్రజా ఉద్యమాలు, సంస్థలు సంఘటిత రాజకీయ విధానంతో పాటు ప్రభుత్వ విధానాలను, పథకాలను ప్రభావితం చేయగల స్థాయిని కూడా చేరుకోవాలి. గత మూడు నాలుగు సంవత్సరాల కాలంలో అనేక ప్రజా సంఘాలు నిధుల కేటాయింపు, ఖర్చు, మళ్లింపు అంశాల మీద మాట్లాడడం ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ ప్రక్రియను అర్థం చేసుకోవడం విశ్లేషించడం, ఈ ప్రక్రియలో వివిధ స్థాయిల్లో సామాన్య ప్రజానీకాన్ని భాగస్వాముల్ని చేయడం, తద్వారా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిరంతరం నిఘా కార్యక్రమాన్ని కొనసాగించాలి.

ప్రభుత్వ విధానాల రూపకల్పనలో వాటి అమలులో దళిత గిరిజన ఇతర వెనుకబడిన కులాల ఆలోచనలను వారి దృక్పథాలను పెంపొందించడానికి ఆయా ఉద్యమాలకు సంఘాలకు బడ్జెట్ విశ్లేషణ చాలా అవసరం. బలహీన వర్గాల దృక్పథాలను, అవసరాలను ఈ బడ్జెట్ విశ్లేషణ ద్వారా ప్రభుత్వం గుర్తించే స్థాయి నిధుల కేటాయింపు, వాటి ప్రభావాన్ని, లబ్ధిదారులకు ఉపయోగపడే స్థాయిని తేటతెల్లం చేస్తుంది. సామాన్య ప్రజానీకం బడ్జెట్‌ని విమర్శనాత్మకంగా అర్థంచేసుకోవడం, దానిపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరం. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, వాటి అమలు వారి స్థానిక అవసరాలకు ఉపయుక్తంగా ఉన్నాయా లేదా అని గుర్తించటానికి పరిపాలనా యంత్రాంగాన్ని బలహీనవర్గాలకు అనుకూలంగా మలచడానికి బడ్జెట్ విశ్లేషణ ప్రజా సంఘాలకు ఉద్యమాలకు బలమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ బడ్జెట్ విశ్లేషణతో దళిత, ఆదివాసీ బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగురేఖల్ని పూయించాలని మా ఆకాంక్ష. ఈ ప్రస్థానంలో మనం అందరం కలిసి నడవాలనేదే మా అభిలాష. ●

## దళిత్ కాల్ లైన్

**నెంబర్ : 040 55440969**

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకువెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి సాక్షి దళిత కాల్‌లైన్‌ని ప్రారంభించింది. దళిత కాల్ లైన్ **నెంబర్ 040-55440969** ని అందరి ముందుకు తీసుకొస్తున్నాం.

గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలు పైన తెలిపిన నంబర్‌కి సత్వరమే తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు

**సాక్షి మానవహక్కుల నిఘా**

# రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నిర్మాణం

...✍ ఎస్.ఎస్. కార్నిక్
సెంటర్ ఫర్ బడ్జెట్ స్టడీస్ ముంబాయి

నేడు దేశంలో ప్రభుత్వ పాలనలో అనేక సందర్భాల్లో బడ్జెట్ సంబంధిత చర్చలు జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కూడా మన ముందుకి రానుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన ఎలా జరుగుతుంది? ఆ చర్చలు అసెంబ్లీలో ఎలా జరుగుతాయి? ఆ బడ్జెట్‌లో దళితులెక్కడ ఉన్నారు? వారి కేటాయింపులు వాటి ఆచరణ ఎలా జరుగుతుంది? ఈ విషయాలు మానవ హక్కుల కార్యకర్తలమైన మన అందరికీ తెలుసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. 2005 జనవరి 6 నుండి 8 వరకు సాక్షి మరియు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్‌ల సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లో బడ్జెట్ విశ్లేషణ మరియు పర్యవేక్షణల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎస్. కార్నిక్ గారి వ్యాసానికి తిమ్మారెడ్డి గారు చేసిన అనువాదంలోని కొంత సమాచారాన్ని కొన్ని వ్యాసాల్ని మీ ముందుకి తెస్తున్నాం. మీ మీ అభిప్రాయాల్ని తెలియజేయగలరని మనవి.

**రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలు:**

ఒక సమాజంలోని ప్రతి వ్యక్తి లేక కొంత మంది వ్యక్తుల సమూహం (ఉదా ॥ కుటుంబం) కాక కొన్ని నిర్ణీత ఆశయాల కొరకై ఏర్పడిన సంస్థలు, (ప్రైవేటు లేక పబ్లిక్) తమ ఆశయాలు సాధించే క్రమంలో డబ్బు ఖర్చు చేయవలసి వస్తుంది. ఈసంస్థలు ఖర్చు భరించడానికి వాటి పరిణామాన్ని బట్టి, లక్షణాలను బట్టి నిర్వహించే కార్యక్రమాలనుబట్టి ఒకటి కాని, అంతకంటే ఎక్కువకాని ఆదాయ వనరులు కలిగి వుంటాయి. ఒక వ్యక్తియైనా, సంస్థయైనా సక్రమైన ప్రుడెంట్ నిర్వహణలో భాగంగా తమ ఖర్చులను తమకు లభ్యమయ్యే వనరులకు లోబడి వుండేటట్టు జాగ్రత్త వహిస్తారు. అదే సమయంలో, ఆయా పరిస్థితులకు అనుగుణంగా సమంజసమైన (ఆప్టిమమ్) ఖర్చును భరించడానికి అవసరమైన డబ్బు అందుబాటులో వుండేటట్టు ఆయా నిర్వాహకులు అదనపు వనరులను సమీకరించడంలో నిమగ్నమై వుంటారు. ఒక నిర్ణీత కాలానికి సంబంధించిన ఆదాయ - వ్యయాలు సమతూకంగా ఉండేటట్టు చూడటానికి ఆ కాలానికి చెందిన ఆదాయం మరియు వ్యయాల్కై ఒక ముందస్తు ప్రణాళికను తయారు చేసుకోవడం చాలా అవసరం. ఈ నిర్ణీత కాలాన్ని మామూలుగా ఒక సంవత్సరంగా పరిగణించవచ్చు. ఈ విధంగా ప్రతి సంవత్సరం ప్రారంభంలోనే తయారు చేసుకునే ముందస్తు ప్రణాళికను "సాలుసరి బడ్జెట్" అని అంటారు.

వ్యక్తులు లేక కుటుంబాల విషయంలో, ప్రణాళికల రూపకల్పనలో ఒకఖచ్చితమైన క్రమాన్ని పాటించవలసిన అవసరం లేకపోవచ్చు. ముఖ్యంగా, ఉన్న ఆదాయ వనరులు ఖర్చులన్నీ తీర్చడంతో పాటు రాబోయే గడ్డురోజులకై (రేయిని డే) కొంత ఆదా చేసుకోవడానికి అనువుగా వున్నప్పుడు ముందస్తు ప్రణాళికను తయారు చేయడంలో ఎక్కువగా శ్రమ పెట్టవలసిన అవసరం లేదు. నిజానికి చాలా సందర్భాలలో ముందస్తు ప్రణాళికను ప్రక్కన పెట్టారు. ఏది ఏమైనా, ఒక వ్యక్తికిగాని, కొందరు వ్యక్తుల సమూహానికి గాని, లేక ఒక సంస్థకు గాని సంబంధించిన బడ్జెట్‌ను రూపొందించడంలో ఒక మూల సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. ఇది ఏమిటంటే, ఖర్చులను ఉన్న ఆదాయ వనరులకు లోబడి వుండేటట్టు చూసుకోవాలి. అంతకు ముందే నిర్ణయించుకున్న ఖర్చులను భరించడానికై సంవత్సరకాలంలో తగినన్ని వనరులను సమీకరించుకోవాలి.

**రాష్ట్ర బడ్జెట్ :**

పైన చర్చించిన ముఖ్య సూత్రం ప్రభుత్వ (కేంద్ర మరియు రాష్ట్ర) బడ్జెట్ రూపకల్పనకు కూడ వర్తిస్తుంది.

ఈ పత్రం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలను ముందుంచుతుంది.

బడ్జెట్‌ను రూపొందించే కార్యక్రమం చాలా ఖచ్చితమైన క్రమాన్ని కలిగి వుంటుంది. బడ్జెట్ రూపకల్పన కొన్ని నియమాలను అనుసరించి జరుగుతుంది. ఈ నియమాలను రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ పరిధిలోనే రూపొందిస్తారు.

సాలుసరి బడ్జెట్‌ను ప్రతిపాదించడం రాష్ట్ర ప్రభుత్వాల యొక్క చట్టబద్ధమైన విధి రాజ్యాంగంలోని 202 ఆర్టికల్‌ను అనుసరించి ఆర్థిక సంవత్సరానికి (ఏప్రిల్ 1వ తేది నుండి మార్చి 31వ తేదీ వరకు) సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆదాయ - వ్యయాల అంచనాలతో కూడిన నివేదికను రాష్ట్ర గవర్నరు రాష్ట్ర శాసన సభ ముందు వుంచాలి. ఈ నివేదికను వార్షిక నివేదిక అంటారు. ఇందులో

1. ప్రజా ప్రయోజనాల కొరకై ఆర్థిక సంవత్సరంలో ఖర్చు పెట్టవలసిన డబ్బును సూచించే నివేదిక
2. ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం సమీకరించే ఆదాయం మరియు రాబడులు
3. ప్రభుత్వము యొక్క ఆర్థిక స్థితిని తెలిపే నివేదికలు ఉంటాయి. ఆర్టికల్ 202తో పాటు రాజ్యాంగములోని 204, 266 మరియు 267 ఆర్టికల్స్ కూడా బడ్జెట్ రూపకల్పనకు సంబంధించినవి.

ఆర్టికల్ 266ను అనుసరించి ప్రభుత్వానికి వచ్చే అన్ని రాబడులు, ప్రభుత్వం తెచ్చిన అప్పులు, ప్రభుత్వం ఇచ్చిన అప్పులు తిరిగి చెల్లించడం ద్వారా అందిన ధనాన్ని రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్‌కు జమ చేయాలి. ఈ ఖర్చులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 204 ప్రకారం రాష్ట్ర శాసన సభ ఆమోదించిన అప్రొప్రియేషన్ యాక్ట్‌లో ప్రతిపాదించిన పద్ధతిని అనుసరించి చేయాలి. ఒకసారి శాసన సభ బడ్జెట్‌ను ఆమోదించిన తరువాత ఆ సంవత్సరంలో చేసే ఖర్చులు ఆ బడ్జెట్ నిబంధనలకు లోబడే జరగాలి.

**బడ్జెట్ తయారీలో పాటించవలసిన సూత్రాలు :**

రాజ్యాంగం యొక్క చట్టబద్ధమైన నిబంధనలను అనుసరించి రూపొందించిన నియమాలను అనుసరించి బడ్జెట్‌ను రూపొందించడంలోని ముఖ్యాంశాలను క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**1. సాలుసరి సూత్రం :**

రాబోయే సంవత్సరానికి సంబంధించి మాత్రమే బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. శాసన సభ ఆమోదించిన గ్రాంట్లు ఒక ఆర్థిక సంవత్సరానికి, అంటే ఆ సంవత్సరపు మార్చి 31వతేదీ వరకు మాత్రమే

చెల్లుతాయి. ఈ గ్రాంట్లను వచ్చే సంవత్సరంలో వాడుకొనడానికి వీలుపడదు. దీనివలన ఆ సంవత్సరంలో నిరుపయోగంగా వున్న గ్రాంట్లు ఆ ఆర్థిక సంవత్సరాంతంలో మురిగి పోతాయి.

**2. సమగ్రతా సూత్రం :**

బడ్జెట్ సమగ్రంగా వుండాలి. ఇందులో రాబోయే సంవత్సరంలోని ఆదాయ - వ్యయాల అంచనాలను పొందుపరచాలి. ఇందులో అన్ని పథకాల మరియు కార్యక్రమాల పూర్తి సమాచారం వుండాలి. ఇందులో వివిధ రంగాల్లో కొనసాగుతున్న కార్యక్రమాల తీరుతెన్నులను వుంచాలి. ఇందులో ప్రభుత్వం యొక్క పూర్తి మరియు సరైన ఆర్థిక పరిస్థితి తెలియజేయాలి.

**3. స్పష్టతా సూత్రం :**

అన్ని ఆదాయ, వ్యయాలను స్పష్టంగా చూపించాలి. గుత్త కేటాయింపులను విడనాడాలి. దీని వలన వివిధ స్థాయిలలో లెక్కలను సరిగా తనిఖీ చేయడానికి వీలవుతుంది. దీనివలన యదార్థమైన ఖర్చులపై నిఘా వుంచడానికి వీలవుతుంది. బడ్జెట్‌కు సంబంధించి అజమాయిషీ చేయ సాధ్యమవుతుంది.

**4. స్థూల బడ్జెట్ సూత్రం :**

ఈ సూత్రానికి రాజ్యాంగములోని ఆర్టికల్ 204(3) ఆధారం. దీనిని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగములో పొందుపరచిన నిబంధనల ప్రకారమే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డబ్బులను వాడుకోవాలి. దీనివలన ఖర్చు పద్దు క్రింద రాబడులను మరియు ఇతర వసూళ్ళను ఖర్చులో కుదింపుగా సర్దుబాటు చేసే పద్ధతిలో ప్రమేయం లేకుండా స్థూల ఖర్చును అధికారికం చేయడం తప్పనిసరి అవుతుంది. ఇది పెద్ద మొత్తంలో వచ్చే వసూళ్ళను తప్పుదారి పట్టించకుండ నివారించడానికి సహాయపడుతుంది.

**5. నిర్ణాయకసూత్రం**

ఆదాయ - వ్యయాలను ఎక్కువజేసి చూపడం కాని, తక్కువ చేసి చూపడం కాని బడ్జెట్ నిబంధనలను ఉల్లంఘించడం అవుతుంది. బడ్జెట్‌లోని అంశాలు సమగ్రంగా వుంటూ, అన్ని ఆదాయ - వ్యయాలను పొందుపరచడమే గాక అవి ఎంతవరకూ అవసరమో ఉండాలి కొంత ఎక్కువగాని, కొంత తక్కువగాని ఉండకూడదు. అయితే ఇది అనుకోని సంఘటనలు లేక పరిస్థితుల వలన ఉత్పన్నమయ్యే మార్పులకు చోటు కల్పించడానికి వీలుగా వుండాలి.

**6. కేటాయింపులను మళ్ళించకూడదనే సూత్రం:**

ఈ సూత్రము ప్రకారము వేరొక దగ్గర జరిగిన అధిక ఖర్చును భరించడానికి ఒక రంగానికి కేటాయించిన నిధులను మళ్ళించడం అంగీకరించబడదు.

**7. ప్రిన్సిపుల్స్ ఆఫ్ పిరియాడిక్ రివైవల్ అండ్ కరెక్టివ్ ఆక్షన్ :**

ఆదాయాలు, వ్యయాలు, రెండింటి విషయంలోను ఆచరణలో చోటు చేసుకుంటున్న యదార్ధ స్థితిని ఎస్టిమేటింగ్ ఆఫీసర్లు, కంట్రోలింగ్ ఆఫీసర్లు మరియు పరిపాలనా విభాగాలు జాగ్రత్తతో పరిశీలిస్తూ వుండాలి. ఎప్పటికప్పుడు సమీక్షలు జరుగుతూ వుండాలి. అంచనాలను క్రమబద్ధీకరిస్తూ వుండాలి. దీనికై సంబంధిత స్థాయిల నుండి ఉత్తర్వులను పొందాలి. పునఃపరిశీలించిన అంచనాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి.

పైన పేర్కొన్న సూత్రాలలో మొదటి సూత్రాలు బడ్జెట్ రూపకల్పనకు వర్తిస్తాయి. చివరి రెండు సూత్రాలు బడ్జెట్ ఆచరణకు వర్తిస్తాయి.

**బడ్జెట్ నిర్మాణము**

రాజ్యాంగములోని ఆర్టికల్సు 266 మరియు 267లను అనుసరించి ప్రభుత్వ బడ్జెట్ యొక్క మౌలిక నిర్మాణాన్ని క్రింది విధంగా వర్గీకరించారు.

(అ) రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్ ఫండు

(ఆ) రాష్ట్రం యొక్క కంటింజెన్సీ ఫండు

(ఇ) పబ్లిక్ అకౌంట్

**(అ) రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్‌ఫండు (పద్దులలో మొదటిభాగం) :** రాజ్యాంగంలోని 266(1) దీన్ని నిర్వచిస్తుంది. ప్రభుత్వ పద్దులలో ఇది మొదటి మరియు అతి ముఖ్యమైన భాగం. రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చులన్నింటిని రాష్ట్రం యొక్క కన్సాలిడేటెడ్ ఫండుకు డెబిట్ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు కన్సాలిడేటెడ్ ఫండుకు జమ చేసిన ఆదాయాల పద్దులను ఈ ఫండు నుండి చేసిన ఖర్చుల పద్దలను కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సూచించిన పద్ధతిలో ఉంచాలి. కన్సాలిడేటెడ్ ఫండ్‌లో ఆదాయాల సెక్షన్ మరియు వ్యయాల సెక్షన్‌లు ఉంటాయి.

**(ఆ) రాష్ట్రం యొక్క కంటింజెన్సీ ఫండు (పద్దులలో రెండవ భాగం) :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 267 దీన్ని నిర్వచిస్తుంది. ప్రభుత్వం ఈ నిధిని ఏర్పాటుచేస్తుంది. దీనిని కన్సాలిడేటెడ్ ఫండ్‌కి డెబిట్ చేస్తారు. ఈ నిధులని ప్రభుత్వం బడ్జెట్ అంచనాలు తయారుచేసే సమయంలో అనుకోకుండా ఎదురయ్యే సంఘటనల కోసం ఖర్చు చేస్తుంది. కంటింజెన్సీ ఫండు నిధులతో భరించిన ఖర్చులపై శాసనసభ నుండి తరువాత అనుమతిని పొందుతారు. ఈ ఖర్చును తరువాత సప్లమెంటరీ డిమాండ్ రూపంలో శాసనసభకు తెలియజేస్తారు.

**(ఇ) పబ్లిక్ అకౌంటు (పద్దులలో మూడవ భాగం) :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 పబ్లిక్ అకౌంట్ యొక్క పరిధిని నిర్ణయిస్తుంది. ఈ పద్దులలో ప్రభుత్వం ఒక బ్యాంకర్‌గా నిర్వహించే లావాదేవీలన్నింటిని పొందుపరుస్తారు. ఇక్కడి ప్రభుత్వం తాను తీసుకున్న డబ్బును తిరిగి చెల్లిస్తుంది. లేకపోతే తాను ఇచ్చిన డబ్బును రాబట్టుకుంటుంది. ప్రావిడెంట్ ఫండు నుండి ఉద్యోగులకు చేసే చెల్లింపులను పబ్లిక్ అకౌంటుకు డెబిట్ చేస్తారు. అదేవిధంగా పబ్లిక్

**ప్రభుత్వ బడ్జెట్ స్వరూపము / పద్దుల వర్గీకరణ**



వర్క్స్, నీటిపారుదల ప్రాజెక్టులు మొదలగు వాటిలో కాంట్రాక్టర్లు నుండి అందే డిపాజిట్లను పబ్లిక్ అకౌంట్‌కు జమ చేస్తారు. పబ్లిక్ అకౌంటులో సమకూరిన డబ్బుకు ప్రభుత్వం కాపలాదారుగా ఉంటుందే కాని దానికి ఆ డబ్బుపై ఎటువంటి అధికారం ఉండదు. పబ్లిక్ అకౌంటు చెల్లింపులకు రాష్ట్రశాసన సభ అనుమతి అవసరం లేదు.

**శాసన సభలో బడ్జెట్**

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 202లో పొందుపరచినట్టు వార్షిక నివేదిక లేక 'బడ్జెట్'ను శాసన సభల ముందుంచాలి. శాసన సభలో బడ్జెట్‌కు అనుమతి ఇచ్చిన తరువాతనే, అంటే దానికి సంబంధించిన అప్రాప్రియేషన్ యాక్ట్ ఆమోదం తెలిపే వరకు అనేక అంచెలు వున్నాయి. ఇవి కింది విధంగా వుంటాయి.

| | | రోజులు |
|---|---|---|
| 1. | శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం | 1 |
| 2. | శాసన సభలో చర్చ ప్రారంభం కాకముందు గడిచిపోయే రోజులు | 2 |
| 3. | శాసన సభలో ఏకకాలంలో చర్చ | 6 |
| 4. | శాసన సభలో ప్రతిశాఖ యొక్క డిమాండ్స్ పై ఓటింగ్ | 18 |
| 5. | శాసన సభలో అప్రాప్రియేషన్ బిల్‌ను ప్రవేశపెట్టడం చర్చించడం, ఓటుకు పెట్టడం మరియు గవర్నరు ఆమోదాన్ని పొందడం | 2 |

ఈ పట్టికను బట్టి చూస్తే శాసన సభ్యులకు బడ్జెట్ గురించి శాసన సభలో చర్చలో పాల్గొనడానికి 26 రోజులు (పై )3), (4) మరియు (5) విషయాలు) అవకాశం ఉంటుంది.

**సాధారణ చర్చ :**

సాధారణ చర్చ యొక్క పరిధి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి కార్యక్రమాలలో సాధించిన ప్రగతి, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించిన కొత్త పన్నులు, అభివృద్ధేతర ఖర్చు మొదలగు ప్రాధాన్యాంశాలకే పరిమితం చేస్తారు. ఈ స్థాయిలో ఓటింగు వుండదు. సాధారణ చర్చ చివరి రోజున ఆర్థిక మంత్రి చర్చాక్రమంలో లేవనెత్తిన విషయాలపై జవాబులను ఇస్తారు.

**శాసన సభలో డిమాండ్లపై ఓటింగు :**

ఇది బడ్జెట్‌పై చర్చలో రెండవ అంశం. శాసన సభలో వివిధ శాఖల డిమాండ్లపై చర్చిస్తారు. ఈ చర్చ 18 రోజులు కొనసాగవచ్చు. ఈ డిమాండ్లపై చర్చలో పాల్గొనే శాసన సభ్యులు చర్చలో ఆయా శాఖల డిమాండ్లను మాత్రమే పరిచయం చేయాలి. శాసన సభలో ప్రతి ఒక్క శాఖ డిమాండును చర్చించిన తరువాత దాని మీద ఓటింగు ఉంటుంది.

**అప్రాప్రియేషన్ బిల్లు ప్రవేశ పెట్టడం :**

వివిధ శాఖల డిమాండ్ల పై ఓటింగు పూర్తి అయిన తరువాత కన్సాలిడేటెడ్ ఫండు నుండి డబ్బును ఉపయోగించుకోవడానికై అప్రాప్రియేషన్ బిల్లును ప్రవేశపెడతారు. ఈ సందర్భంలో డిమాండ్లు పై ఓటింగు సమయంలో చర్చకు రాని శాఖల గురించిన విషయాలను లేవనెత్తడానికి శాసన సభ్యులకు అవకాశం ఉంటుంది.

అప్రాప్రియేషన్ బిల్లును శాసన సభలో ఓటింగుకు పెడతారు. సభలో ఆమోదం పొందిన తరువాత బిల్లును గవర్నరు ఆమోదం కోసం పంపుతారు. గవర్నరు ఆమోదం పొందిన బిల్లు చట్టరూపం సంతరించుకుంటుంది. ఈ చట్టంలో చూపిన సొమ్ము బడ్జెట్ అనుమతించిన గ్రాంటు అవుతుంది. ఆయా శాఖలు వాటికి కేటాయించిన సొమ్మును కన్సాలిడేటెడ్ ఫండు నుండి వాడుకోవచ్చు.

పైన చర్చించిన దానిని బట్టి బడ్జెట్ ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడానికి 34 రోజులు పడుతుంది. ఇందులో 26 రోజుల చర్చకు శాసన సభ్యులకు అవకాశం ఉంటుంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజునే బడ్జెట్ ప్రచురణలన్నీ శాసనసభ్యులకు అందుబాటులో వుంటాయి. పెర్‌ఫార్మెన్స్ బడ్జెట్ ప్రతులు అన్నీ సాధారణ చర్చ ప్రారంభమయ్యే సమయానికి సభ్యులకు అందుబాటులో వుంటాయి. ఈ విధంగా శాసన సభలో ఫలవంతమైన, అర్థవంతమైన చర్చలు చోటు చేసుకోవటానికి వీలుగా బడ్జెటుకు సంబంధించిన సమాచారం అంతా శాసన సభ్యులకు అందుబాటులో వుంటుంది. వివిధ శాఖల డిమాండ్లపై చర్చించడానికి 18 రోజుల సమయం ఉంటుంది. అయితే ఈ సమయాన్ని కుదించే అధికారం శాసనసభ స్పీకర్‌కు ఉంటుంది. దీనికి స్పీకర్ సభానాయకునితో చర్చిస్తారు. అయితే శాసన సభ్యులు బడ్జెటు చర్చలు జరిగే రోజులను పెంచమంటూ స్పీకర్‌ను ఒప్పించవచ్చు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి బడ్జెట్‌కు ఆమోదం లభింప చేసేందుకు వీలుగా బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజుకు, ఆర్థిక సంవత్సరం ఆఖరు రోజుకు, అంటే మార్చి 31వ తేదీకి మధ్య 34 రోజుల వ్యవధి ఉండేటట్లు జాగ్రత్తపడతారు. అయితే ఈ మధ్య బడ్జెట్‌ను మార్చి నెల మధ్యలో ప్రవేశపెట్టడం వలన మార్చి నెలాఖరుకు బడ్జెట్ ఆమోదం పొందడానికి వీలుకావడం లేదు.

ఈ సమస్యను అధిగమించడానికి రెండు నెలలకు ఎప్రిల్ మరియు మే) మార్చి నెలాఖరులోగా ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆమోదింపజేస్తారు. మొత్తం బడ్జెట్ మీద చర్చను ఎప్రిల్ నెల వరకు పొడిగిస్తున్నారు. జిల్లా పరిషత్తులకు చెల్లించవలసిన వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల అంచనాను ప్రభుత్వం యొక్క గ్రామీణ అభివృద్ధి శాఖ తయారుచేస్తుంది.

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి దానికై నియమింపబడ్డ అధికార యంత్రాంగం గురించి కొంత అవగాహన కలుగుతుంది. ఈ అవగాహన బడ్జెట్ తయారీలో నిమగ్నమైన వారికే కాక బడ్జెట్ రాయితీలను పొందే వివిధ టార్గెట్ గ్రూపుల సంక్షేమం కాంక్షించే వారికి వారి సంక్షేమం కొరకై పనిచేసే వారికి కూడా అవసరం. బడ్జెట్ యొక్క పరిమాణం వివిధ శాఖల క్రింద ఉన్న అసంఖ్యాకమైన కేటాయింపులను దృష్టిలో ఉంచుకున్నప్పుడు మానవ హక్కుల ఉద్యమకార్యకర్త తన ప్రయత్నాలు ఫలవంతం కావడానికి తాను పరిశోధించదలుచుకున్న అంశాలను నిర్ధారించుకోవడం అత్యవసరం.

అణగారిన దళిత వర్గాల సంక్షేమం కొరకు ప్రవేశపెట్టిన పథకాలు, వాటి ప్రయోజనాలు అవసరమైన వారికి అందాయా లేదా అని పరిశోధించి తెలుసుకోవడం ఈ ప్రయోజనాలు సరిగా అందని ప్రదేశాల్లో పరిపాలనా యంత్రాంగం చురుకుగా పనిచేసేటట్లు చూడటానికి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవడం మానవ హక్కుల ఉద్యమకార్యకర్తల యొక్క విధి. ఈ విధి విధానాల అమలుకోసం దళిత మానవహక్కుల కోసం పనిచేసే ప్రతి ఒక్కరూ పాటుపడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# బడ్జెట్‌లో గలగల, సంక్షేమం విలవిల

...✍ వి. హనుమంత రావు

ఒకప్పుడు పత్రికల్లో, నాయకుల, ఉపన్యాసాల్లో 'సామాజిక సంక్షేమం', 'హరిజన, గిరిజన అభివృద్ధి' లాంటి మాటలు తరచూ వినబడుతుండేవి. కాని గత పది సంవత్సరాలుగా 'హరిజన' అనే పదం బదులు 'దళిత' అనే పదం వినబడుతోంది. పదం మారింది కాని ఎస్సీల తలరాతల మారలేదు సరికదా వారి స్థితిగతులు మరింత క్షీణిస్తున్నాయి. సంక్షేమం ఉపన్యాసాలకే పరిమితమైంది. వారి బాగోగుల కోసం చేసే కేటాయింపులు చాలా సంవత్సరాల్లో ఖర్చే కావడం లేదు. కొన్ని సంవత్సరాలలో అసలు కేటాయింపులే వుండడం లేదు. ఇన్ని వందల, వేల కోట్లు కేటాయించమని చెప్పినప్పుడు అంకెలు ఆకర్షణీయంగానే వుంటాయి కాని ఆచరణ ఆమడదూరంలో ఉంటుంది. ఈ పరిణామాన్ని లోతుగా అధ్యయనం చేసే ఉద్దేశ్యంతో 1991-92 నుంచి 1999-2000 వరకూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖ ఎస్సీల అభివృద్ధికి వేర్వేరు పథకాలకు ఎంతెంత కేటాయించారు, ఎంత ఖర్చు చేశారు అనే గణాంక వివరాలను పరిశీలించడం జరిగింది.

### సాంఘిక సంక్షేమం కోసం ఖర్చు

సాంఘిక సంక్షేమం అంటే దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు, వికలాంగులు, వృద్ధులు, జోగినులు, యాచకులు, వృద్ధాప్య పింఛన్లు, కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం, అన్నిరకాల, వర్గాల ప్రజలు ఈ పద్దు కిందకు వస్తారు. దళితులు, గిరిజనులు జనాభా లెక్కలు మాత్రమే వేరుగా ఉన్నాయి గాని పైనుదహరించిన వర్గాల ప్రజల జనాభా వివరాలు లేవు. అయినా వీరందరి జనాభా మొత్తంలో సగం కన్నా ఎక్కువగానే వుంటారు. ఇంతమంది సంక్షేమం కోసం ఘనత వహించిన ప్రభుత్వం ఎంత 'ఘనంగా' ఖర్చు పెట్టిందో చూడండి.

| సం॥ | రెవెన్యూ పద్దుకింద ఖర్చు | సామాజిక సంక్షేమ ఖర్చు (రూ. కోట్లలో) | శాతం |
|---|---|---|---|
| 91-92 | 5895 | 346 | 5.87 |
| 92-93 | 6764 | 381 | 5.63 |
| 93-94 | 7492 | 373 | 4.98 |
| 94-95 | 8388 | 421 | 5.02 |
| 95-96 | 10060 | 445 | 4.42 |
| 96-97 | 13354 | 545 | 4.08 |
| 97-98 | 13663 | 565 | 4.13 |
| 98-99 | 15250 | 449 | 2.94 |
| 99-2000 | 18023 | 546 | 3.03 |

రెవెన్యూ పద్దు కింద ఇన్ని రకాల వర్గాలకు పెట్టిన ఖర్చు నానాటికి తీసికట్టు నాగం బొట్లు అన్నట్లుగా 5.87 శాతం నుంచి 3.03 శాతానికి దిగజారడం, మొత్తంలో వీరికి పెట్టిన ఖర్చే ఇంత అల్పంగా వుండడం చూస్తే అణగారిన వర్గాల ప్రజలను ఒక పథకం ప్రకారం ఇంకా ఎలా అణగదొక్కడానికి ప్రయత్నిస్తుందో వెళ్ళడవుతుంది. ఇంత తక్కువ ఖర్చులో కేవలం దళితులకు ఎంత ఖర్చు అంటే ముష్టిలో వీరముష్టి అన్నట్లుంటుంది. అదెలా వుందో చూద్దాం.

దళితుల గురించి ప్రభుత్వం మొసలి కన్నీళ్ళు కారుస్తుందనే విషయంపై పట్టిక చెప్పకనే చెబుతుంది. (1) గత పది సంవత్సరాల్లో ఒక సంవత్సరం తప్ప, మిగతా తొమ్మిది సంవత్సరాల్లో కేటాయించిన సొమ్ము పూర్తిగా ఖర్చు చేయలేదు. సరికదా మొదటి సంవత్సరంలో కేటాయింపునకు, ఖర్చుకు తేడా కేవలం రూ. 15 కోట్లు మాత్రమే

**సామాజిక సంక్షేమం ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం**

**(రూ.లు కోట్లలో)**

| సం॥ | కేటాయింపు | ఖర్చు | సాం.సం. ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం | మొత్తం రెవెన్యూ ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం |
|---|---|---|---|---|
| 90-91 | 196 | 181 | 52 | - |
| 91-92 | 234 | 258 | 68 | 4.4 |
| 92-93 | 254 | 253 | 68 | 3.7 |
| 93-94 | 271 | 262 | 70 | 3.5 |
| 94-95 | 317 | 276 | 66 | 3.3 |
| 95-96 | 341 | 269 | 60 | 2.7 |
| 96-97 | 326 | 319 | 59 | 2.4 |
| 97-98 | 415 | 307 | 54 | 2.3 |
| 98-99 | 428 | 421 | 94 | 2.8 |
| 99-00 | 452 | 327 | 60 | 2.5 |

అయితే, ఆఖరు సంవత్సరంలో అది రూ. 125 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా ఆఖరు రెండు సంవత్సరాల మధ్య ఖర్చు సుమారు నూరు కోట్లు తగ్గిపోయింది. (2) సంక్షేమ శాఖ ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం సగంపైగా వున్నా, 91-92లో 66శాతం నుంచి 60శాతానికి పడిపోయింది. (మధ్య ఒక సంవత్సరం తప్ప). అలాగే మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ పద్దు కింద ఖర్చులో ఎస్సీలకు ఖర్చుశాతంపైన ఉదహరించిన కాలంలోనే 4.4శాతం నుండి కేవలం 2.5 శాతానికి దిగజారింది. ఎస్సీల పట్ల ప్రభుత్వం శీతకన్ను వేసిందనడానికి ఇది తిరుగులేని సాక్ష్యం.

### 15. శాతం ఖర్చు ఎప్పుడూ లేదు

ప్రభుత్వంలో ప్రతి శాఖ తనకు కేటాయించిన నిధులలో 15శాతం ఎస్సీలకు ఖర్చు చేయాలనేది ప్రభుత్వం ఆదేశం. ఆ నిర్ణయాన్ని శాఖలు ఎంత చక్కగా అమలుపరిచాయో చూడండి.

(రూ.లు కోట్లలో)

| సం॥ | మొత్తం కేటాయింపు | దళితులకు ఖర్చు | మొత్తం దళితుల వాటా |
|---|---|---|---|
| 1991-93 | 1997 | 183 | 9.15 |
| 1993-94 | 2076 | 215 | 10.36 |
| 1994-95 | 2170 | 217 | 10.00 |
| 1995-96 | 2720 | 267 | 10.00 |
| 1996-97 | 2773 | 228 | 8.22 |
| 1997-98 | 3585 | 214 | 5.97 |
| 1998-99 | 4679 | 533 | 11.38 |
| 1999-00 | 5479 | 189 | 3.46 |
| 2000-01 | 8228 | - | - |

(2001-02 పెర్‌ఫార్మెన్స్ బడ్జెట్ నుంచి)

పై పట్టిక ద్వారా ఏ సంవత్సరంలోనూ దళితుల కోసం 15శాతం ఖర్చు చేయలేదని, ఒక్క సంవత్సరంలో తప్ప మిగతా తొమ్మిది సంవత్సరాల్లో 10శాతం మించి ఖర్చుచేయలేదని, నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లు 9.15శాతంతో ప్రారంభమై 3.46 శాతానికి దిగజారిపోయిందని విధితమౌతుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభుత్వ శాఖలే అమలుపరచకున్నా, చూస్తూ వూరుకొన్నదంటే ఇదెంత చచ్చు దద్దమ్మ ప్రభుత్వమో మీరు వూహించుకోవచ్చు.

**ఆర్థికాభివృద్ధి**

దళితులు వాళ్ళ కాళ్ళమీద వారు నిలబడి ఆర్థికంగా స్వతంత్ర జీవనం గడపాలంటే వారికి కావాల్సింది, ఇవ్వాల్సింది భూమి. విద్య, వైద్యం భూ సంస్కరణలు అమలుపరచినపుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమని నోబెల్‌బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అనేకసార్లు పునరుద్ఘాటిస్తూ వచ్చారు. తూర్పు ఆసియా దేశాలు అభివృద్ధి సాధించాయంటే, ఈ మూడు కార్యక్రమాలను ఆ దేశాలు ఎప్పుడో అమలుపరచడం వల్లనే సాధ్యమైంది. ఒకటవ ప్రణాళిక నుంచి తొమ్మిదో ప్రణాళిక వరకూ ప్రతి ప్రణాళికలో భూ సంస్కరణలు అమలుపర్చాలని పునరుద్ఘాటనైతే జరుగుతుంది. కాని అమలుమాత్రం ఆమడ దూరంలోనే వుంటోంది. అంత కీలకమైన కార్యక్రమానికి దళితుల ఆర్థికాభివృద్ధికి రూపొందించి అమలుపరుస్తున్న పథకాల్లో స్థానం లేకుండా పోయిందంటే, వారిపట్ల చూపిస్తున్న ప్రేమ కటప ప్రేమ అని తేటతెల్లమౌతుంది.

దళితుల అభివృద్ధి కార్పోరేషన్ ద్వారా అమలుపరిచే కార్యక్రమాల్లో మిగులు భూముల అభివృద్ధి, ఇళ్ళ స్థలాలు, వారికి తక్కువ వడ్డీతో రుణాలు, వారి భూములకు నీటి సదుపాయం కల్పించుకోవడానికి ఆర్థికసహాయం లాంటి పథకాలున్నాయి. కార్పోరేషన్‌కిచ్చే నిధులున్నాయి. దళితులకు భూమి పంపకానికి, భూ సేకరణకు ఆ పథకాల్లో స్థానమే లేదు. పోనీ, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశారా అంటే అదీ లేదు. బడ్జెట్లో గత పది సంవత్సరాల్లో దళితుల కోసం ఖర్చు చేసిన మొత్తం ఖర్చులో కేవలం 12.77 శాతం మాత్రమే. కనీసం అంత తక్కువగా కేటాయించిన సొమ్మయినా ఖర్చు చేశారా అంటే ప్రతి నాలుగు రూపాయల్లో మూడు రూపాయలు మాత్రమే ఖర్చు అయింది. ఈ ఖర్చులో కూడా ప్రత్యేక కాంపొనెంట్ ప్రణాళికకు కేంద్రం ఇచ్చే సహాయం కూడా కలిసి వుంది. కేంద్ర సహాయం తీసివేసి చూస్తే ఈ శాతం ఇంకా తక్కువగా వుండేది. ఈపాటి ఖర్చు కూడా అయి వుండేది కాదు.

దళితులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలిచ్చే పథకం అమలుచేస్తున్నామని రొమ్ము విరుచుకు తిరిగే ప్రభుత్వం ఆచరణలో కేటాయించింది ప్రతీ సంవత్సరం ఒక లక్ష మాత్రమే. (రాష్ట్రంలో 1991 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలు 114 లక్షలు) ఆ లక్షలో ఒక్క నయాపైసా కూడా ఖర్చు చేయని సంవత్సరాలున్నాయి. 97-98 నుంచి ఆ లక్ష కేటాయింపునకు కూడా మంగళహారతి పాడేసింది ప్రభుత్వం.

ఆర్థిక కార్యక్రమాలన్నీ ఆం.ప్ర. షెడ్యూల్డ్ తరగతుల సహకార ఆర్థిక కార్పోరేషన్ ద్వారా అమలు జరుగుతున్నాయి. ఈ కార్పోరేషన్ అందజేసే ఆర్థిక సేవల వల్ల దళితులు బాగుపడిపోతున్నారనో ఏమో గాని 1994-95 నుంచి కేటాయింపులు రూ. 16-18 కోట్ల మేరకు చేసినా, ఖర్చు అందులో నాలుగోవంతో, సగమో మాత్రమే వుంటూ వచ్చింది.

ఎస్సీల్లో దారిద్ర్యాన్ని తగ్గించుకోవడానికి ఓ పథకం 92-93లో ప్రారంభించి 94-95 వరకు రూ. 114 కోట్లు ఖర్చు చేస్తే, ఆ తర్వాత సంవత్సరంలో కేవలం తొమ్మిది కోట్లు మాత్రమే ఖర్చు చేసి, తదనంతరం కేటాయింపులే లేకుండా చేశారు. ఎస్సీలు తమ భూముల్లో నీటిపారుదల సౌకర్యాలు కల్పించుకోవడానికి ఆర్థిక సహాయం పథకం కింద 99-00లో రూ. 18 కోట్లు కేటాయించి కేవలం నాలుగు కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంతకుముందు కూడా 93-94 వరకూ కేటాయిస్తూ వచ్చిన సొమ్ము పూర్తిగా ఖర్చు చేస్తూ వచ్చినా, ఆ తర్వాత ఒకటి రెండు సంవత్సరాలు మూడో వంతు, లేదా సగం ఖర్చు చేశారు. మరో రెండు సంవత్సరాలు కేటాయింపులే గాని ఖర్చు లేదు. ఇలా అస్తవ్యస్తంగా కేటాయింపులే చేయకపోవడం, చేసినా ఖర్చు చేయకపోవడం, లేదా కొద్దిగా ఖర్చు చేయడం అనేక పథకాల విషయంలో కనిపిస్తూ వుంటుంది.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల కేసులు ఏటేటా పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో ఇంకా దళితుల పట్ల వివక్షత చూపుతున్నారు. నెల్లూరు, కర్నూలు, కడప, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో, ఒక్కో జిల్లాలో వందకుపైగా కేసులు విచారణలో వున్నాయి. రాష్ట్రంలో 1998లో దళితులపై దాడులు, అత్యాచారాల వంటి ఘటనలు 1805 జరుగగా, 1999లో 1897, 2000లో 1912 జరిగాయి. అయితే కేవలం 27 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి.

ఈ సందర్భంలో బడ్జెట్లలో కేటాయింపులు చూడండి. దళితులు, గిరిజనులపై దాడుల నుంచి రక్షణ కోసం కోర్టులు అనే పద్దుకింద 91-92 నుంచి 99-00 వరకూ కేటాయింపులు రూ. 27 కోట్లు కాగా, ఖర్చు కేవలం రూ. 18 కోట్లు మాత్రమే. ఈ పాటైనా ఖర్చు చేసి దళితుల మీద దాడులు చేసిన వారి మీద ఎలాంటి శిక్షలు విధించారు అనే విషయంపై సమాచారం లేదు.

**భూముల కొనుగోలు**

దళితులకు ప్రభుత్వం చేసిందని చెప్పబడుతున్న కార్యక్రమాల్లో విద్య తర్వాత ఇళ్ల స్థలాల సేకరణ, గృహ నిర్మాణాలకు ప్రాధాన్యత లభించింది. సింహ భాగం కేటాయింపులు ఈ పద్దులకే చేయడం జరిగింది. అయితే ఈ కేటాయింపులు, ఖర్చులు ఒక పద్ధతి ప్రకారం జరగలేదు. మనం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానం అవలంబిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొంటుంది. కాని ఆచరణలో తద్విరుద్ధంగా జరుగుతోంది. భూమి సేకరణ, గృహ నిర్మాణ పద్దుల్లో కొన్ని సంవత్సరాలు కేటాయింపులే లేవు. మరికొన్ని సంవత్సరాల్లో కేటాయింపులు లాంఛనంగా వుంటాయి. ఒకటి రెండు సంవత్సరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇంత చేసినా మొత్తం 10 సంవత్సరాల్లో చేసిన కేటాయింపులు రూ. 284 కోట్లు అయితే ఖర్చు 214 కోట్లు (75.35శాతం) 1991 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో దళితుల జనాభా 106 లక్షలు. వీరిలో 83 లక్షల మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వారంతా భూమి లేని నిరుపేదలే. వారిలో వ్యవసాయ కూలీల సంఖ్య 44 లక్షలు.

వారికి ఇటు ఇళ్ళ వసతి, భూ వసతి కల్పించడానికి రూ. 500 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వారిని ఏం ఉద్ధరించారో వూహించుకోవడం కష్టమేమీ కాదు. మొదటి నుంచి 97-98 సెప్టెంబర్ వరకూ కట్టిన ఇళ్ళ సంఖ్య 25 లక్షలు. ఈ సంఖ్య కేవలం మొత్తం బలహీన వర్గాలది. కేవలం దళితులకెన్నో వెంటనే లభ్యం కాలేదు. వీటిలో కనీస సౌకర్యాలున్న ఇళ్ళ సంఖ్య 1991 నాటికి 23 నుంచి 55శాతం మాత్రమే. టి.వి.లల్లో గ్రామీణ ప్రాంతాల సీన్లు చూచినపుడు ఆ గ్రామాల్లో కొన్ని దళితుల కాలనీల దృశ్యాలు 50 సంవత్సరాల క్రితం ఎలా వున్నాయో అలాగే కనిపిస్తున్నాయి. అవే తాటాకు గుడిసెలు, అదే అపరిశుభ్రత, అవే పాడుపడిన రహదారులు. అక్కడక్కడ కొన్ని శాశ్వత గృహాల కాలనీలు దర్శనమిస్తుంటాయి. వాటిల్లో కొన్ని చోట్ల మొత్తం కాలనీలు మెయింటెనెన్స్ లేక పాడుపడిన కొంపల్లా వుంటాయి.

ఇది ఇళ్ళ నిర్మాణం భాగోతమైతే వ్యవసాయ భూముల కొనుగోలు, పంపిణీ భాగోతం మరోలా వుండదు కదా. ఈ విషయంలో ఎస్సీ కార్పోరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్సీలకు భూముల కొనుగోలు కార్యక్రమాల గురించి కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. ఈ కార్పోరేషన్ ఏర్పడిన 25 సంవత్సరాల కాలంలో 31.69 లక్షల కుటుంబాలకు రూ. 1870 కోట్లు సహాయం చేసినట్లు చెప్పుకొంటుంది. ఈ సంస్థకు రుణాలిచ్చేందుకే లక్ష్యాలున్నాయి గాని వాటి వసూలుకు

లక్ష్యాలు లేవు. అధికారుల లాలూచీలు, రాజకీయ నాయకుల స్వార్థం అంతా కలిపి కోట్ల కొద్ది బకాయిలు పేరుకున్నాయి. బకాయిలు పేరుకొనడంతో కొత్త రుణాలు లేకుండా పోయాయి. లబ్దిదారులు అర్హులా, అనర్హులా అన్నది గమనించకుండా కార్పోరేషన్ ఎడాపెడా రుణాలు మంజూరు చేసింది. అసలైన వారికి, అర్హత కలిగిన వారికి రుణం అందజేయాల్సి వచ్చే సరికి కొరత ఏర్పడింది. దీనితో 1992 నుంచి కార్పోరేషన్ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పేరుకుపోయిన రుణ బకాయిలు కార్పోరేషన్ మనుగడకే కష్టమయ్యేలా చేశాయి. కార్పోరేషన్ ద్వారా కర్నూలు జిల్లాలో నాలుగు కోట్ల రూపాయలు వెచ్చించి (డిసెంబర్ 2000 వరకూ 2200 ఎకరాలను 1500 మంది లబ్దిదారులకి పంపిణీ చేశారు) పంపిణీ చేసినట్లు చెబుతున్న ఈ భూముల్లో 300 ఎకరాల పంపిణీ అయిన భూమి వ్యవసాయానికి పనికిరాదు. ఎందుకూ పనికిరాని భూమిని రూ. 20,000 - 50,000 లకు కొనుగోలు చేశారనే ఆరోపణ. ఈ ఆరోపణలను విచారించమని రాష్ట్ర వ్యాపిత దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించగా, అప్పటి కమీషనర్ చెల్లప్ప ఈ భూములను చూచి నిర్ఘాంతపోయి" "ఈ భూములు ఎలా తీసుకున్నారు. ఎందుకు తీసుకున్నారు" అని ప్రశ్నించారు. ఇలాంటి ఫిర్యాదులు పశ్చిమగోదావరి జిల్లాలో కూడా వినవచ్చాయి. దళిత మహిళలను ఆదుకునే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన భూముల పథకం కింద వాస్తవంలో రాజకీయ నాయకులు, అధికారులు జేబులు నింపుకోవడానికి బాగానే ఉపయోగపడ్డాయి.

**పారిశుధ్య కార్మికులు**

పేదల్లో అతి పేదలు, అతి హేయమైన, అపరిశుభ్రమైన వృత్తుల్లో మగ్గుతున్న వారికి ప్రత్యామ్నాయ వృత్తులు ఏర్పాటుచేస్తామని దశాబ్ద కాలంలో బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ. 161 లక్షలు. కాని ప్రభువులు అందులో సుమారుగా సగమే (90 లక్షలు) ఖర్చు చేసారు. 96-97 నుంచి కేటాయించడమే మానుకొంది. విద్యాలయాల్లో పారిశుధ్య పనులు చేసే దళిత బాలికలు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకోవడానికి ప్రోత్సాహకాలిచ్చే పథకం ప్రవేశపెట్టడమే గాని గత 10 సంవత్సరాలుగా కేటాయింపులే లేవు. కేటాయింపే లేని పద్దు కొనసాగించడం అంటే ఆ వర్గం చెవిలో పువ్వు పెట్టడమే. ఆ వృత్తుల్లో పనిచేసే వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్న ప్రభుత్వం రూ. 1446 లక్షలు. ఖర్చు చేస్తామని చెప్పి ఆచరణలో పది సంవత్సరాల్లో రూ. 879 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు.

**విద్య కోసం**

ఎస్సీల కోసం చేసిన మొత్తం ఖర్చులో స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ళు, ఇతర విద్యా సౌకర్యాల కోసం చేసిన ఖర్చు 70శాతం వుందని సంతోషించాలా? లేక చదువుకొనే వయస్సు గల సుమారు 20శాతం విద్యార్థులకు 70శాతం ఖర్చు చేసి, మిగతా 80శాతం ఎస్సీ ప్రజలకు 30శాతం నిధులు మాత్రమే ఖర్చు చేసినందుకు విచారించాలా? నిజానికి ఈ 80శాతం ప్రజల జీవన స్థాయినీ, వారి ఆర్థిక పరిస్థితిని బాగుపరచడానికి తగు చర్యలు తీసుకొని వుంటే విద్య కోసం ఇంత మొత్తం ఖర్చు చేయాల్సిన అవసరం వుండకుండా పోయేది కదా? స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించిన మొత్తాన్ని రెండు సంవత్సరాల్లో తప్ప మిగతా అన్ని సంవత్సరాల్లో కేటాయింపుల కన్నా హెచ్చుగానే ఖర్చుచేసినా, హాస్టళ్ళ కేటాయింపులు రెండు సంవత్సరాల్లో తప్ప మిగతా అన్ని సంవత్సరాల్లో పూర్తిగా ఖర్చు చేయలేదు. మొత్తం పది సంవత్సరాల్లో రూ. 947 కోట్లకు గాను ఖర్చు చేసింది రూ. 879 కోట్లు మాత్రమే. హాస్టళ్ళలో నివసించే విద్యార్థులకు ఇచ్చే మెస్ ఛార్జీలు అపుడపుడు పెంచుతున్నామని ప్రకటనలు చేస్తున్నా, కేటాయింపులు పూర్తిగా ఖర్చు చేయలేకపోవడమేమిటి? ఈ సంక్షేమశాఖ హాస్టళ్ళు పనిచేసే తీరు గురించి స్వయానా మంత్రులే ఆకస్మిక తనిఖీలు చేసినపుడు బయటపడిన విషయాలు తరచుగా మనం పత్రికల్లో చదువుతూనే వున్నాం. ఆ హాస్టళ్ళలో ఒకే గదిలో పది పదిహేనుమందిని కుక్కడం, వారికి ఇవ్వాల్సిన దుస్తులు వారికి ఇవ్వకపోవడం, గదుల్లో విద్యుద్దీపాలు వెలక్కపోవడం, మేనేజ్‌మెంట్లు పెట్టే తిండితో సగం ఆకలి కూడా తీరకపోవడం - వార్డెన్ల లీలలు చెప్ప తరమా? క్లుప్తంగా చెప్పాలంటే ఈ హాస్టళ్ళకోసం గత పది సంవత్సరాల్లో చేసిన రూ. 879 కోట్ల రూపాయల ఖర్చులో ఎంత ఈ వార్డెన్లను మింగేశారో, విద్యార్థులకు ఎంత అందిందో మీరే వూహించుకోవచ్చు. ఇక్కడ వీరి చదువుల గురించి ప్రభుత్వాధికారి కె. ఆసయ్య చేసిన అధ్యయనంలో చెప్పిన విషయాలు చూడండి. ఇటీవలి జనాభా లెక్కలూ మొత్తం జనాభా ఎంతో చెబుతున్నాయి గాని, ఎస్సీల గురించిన వివరాలు ఇంకా రావాల్సి వుంది. కాగా, 90వ దశకం గణంకాల మీదే ఆధారపడి ఈ విషయాన్ని ఆయన అధ్యయనం చేశారు. "షెడ్యూల్ కులాల్లో మూడొంతులు ఇంకా నిరక్షరాస్యులే. ఈ కులం వారు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. వీరిలో అక్షరాస్యత శాతం పెరగడం లేదు. 37.41 శాతం మాత్రమే సాధ్యమైంది. ఇదే సమయంలో ఇతర కులాల అక్షరాస్యత 57.40 శాతానికి పెరిగింది. 1961లో షెడ్యూల్డ్ కులాలు, ఇతరుల మధ్య అక్షరాస్యత తేడా 17.59 వుండగా, అది 1991 నాటికి 19.99కి పెరిగింది. ఇది ఆందోళన కలిగించే విషయం. మరో ముఖ్యమైన అంశం ఈ కులాల్లో మహిళల్లో దాదాపు 85శాతం మంది నిరక్షరాస్యులే. సాధారణ స్త్రీల అక్షరాస్యత 39.29 శాతం వుండగా, షెడ్యూల్డ్ కులాల్లో కేవలం 13.05 శాతం మాత్రమే. 1996-97లో ఈ కులాల బాలలు, 1,79,05,393 మంది ప్రాథమిక విద్యలో, 59,56,427 మంది మాధ్యమిక విద్యలో వున్నారు. ఇదే సంవత్సరంలో ఇతర కులాల్లో 11,03,93,403 మంది ప్రాథమిక విద్యలో 4,10,64,849 మంది మాధ్యమిక విద్యలో 2,70,36,856 మంది హయ్యర్ సెకండరీ విద్యలో 5,89,407 మంది ఉన్నత విద్యలో చేరారు. (చెకప్ ఫిగర్స్) ప్రభుత్వం అనేక వసతులు కల్పించినా, షెడ్యూల్డు కులాల్లో అభివృద్ధి పనులు అయిష్టంగానే అమలు జరుగుతున్నాయి." (వార్త నవంబర్ 2000) చెరిన సంఖ్యలు లక్షల్లో కనిపిస్తున్నాయి గాని వారిలోంచి డ్రాప్ అవుట్స్ ఎన్ని లక్షల మంది ఉన్నారో అందరికీ తెలిసిన విషయమే.

స్కాలర్‌షిప్ లెక్కలన్నీ కాకుల్లెక్కుల్లా వున్నాయి. రెండు, మూడు ఉదాహరణలు చూడండి. 90-91లో కేవలం 150 లక్షల మొత్తాన్ని అయిదు లక్షల మంది ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఇచ్చారట. అంతకన్నా తక్కువ మొత్తాన్ని, అంటే రూ. 128 లక్షల మొత్తాన్ని 94-95లో నాలుగు లక్షల మంది విద్యార్థులకు ఇచ్చారట. మరీ విచిత్రమంటే ఆ తర్వాతి సంవత్సరంలో కేవలం రూ. 14లక్షల మొత్తాన్ని 3.23 లక్షల మందికి ఇచ్చారట. 98-99 నుంచి కేటాయింపులూ లేవు. ఖర్చులూ లేవు. అలాగే మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులకు 98-99లో ఒక్కొక్కరికి సగటున సంవత్సరానికి రూ. 1566లు, అంటే నెలకు రూ. 130లు ఆర్థిక సహాయం ఇచ్చారట. ఈ మొత్తం నాలుక గీసుకోవడానికి కూడా చాలదు. కాలేజీ విద్యార్థులకు 93-94లో 4738 మందికి రూ. 169 లక్షలు ఖర్చు చేసారట. విశేషమంటే, ఆ తర్వాత సంవత్సరంలో కేవలం రూ. 23 లక్షలు ఖర్చు చేసి 11 వేల మంది విద్యార్థులకు సహాయపడ్డారట. ఆ తర్వాత కేటాయింపులే లేవు. ఇలా సవాలక్ష ఉదాహరణలివ్వవచ్చు.

**స్కాలర్‌షిప్‌లు**

ఒకటి రెండు తరగతుల్లో చదువుకునే దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం 90-91 నుంచి ప్రతీ సంవత్సరం రూ. 15 లక్షల నుంచి రూ. 250 లక్షల వరకు కేటాయించి 94-95 వరకూ పూర్తిగా లేక పాక్షికంగా ఖర్చు చేయగా, ఆ తర్వాత కాలంలో ఒక

సంవత్సరం రూ. 271 లక్షలు కేటాయించి, రూ. 14లక్షలు, మరో ఏడాది రూ. 101 లక్షలకు గాను రెండే రెండు లక్షలు ఖర్చుచేసి, 97-98 నుంచి పూర్తిగా బంద్ చేసారు. ఒకే ఒక సంవత్సరంలో కేటాయింపు కన్నా ఎక్కువ ఖర్చు చేసింది. ఏ వయస్సులో అయితే ప్రోత్సహించి, డ్రాప్ అవుట్ కాకుండా చూడాలో, ఆ వయస్సులో ప్రోత్సాహకాన్ని ఉపసంహరించిన ఘనత మన ప్రభుత్వాలకే దక్కుతుంది.

పేరెన్నికగన్న పాఠశాల్లో, కాన్వెంట్లలో దళిత విద్యార్థులకు సబ్సిడీ, స్కాలర్‌షిప్‌లకు గత దశాబ్దం మొదటి అర్థభాగంలో కేటాయింపులకు సమతూకంగానే ఖర్చు జరిగింది. అయితే వీరి మీద ఖర్చు 6లక్షల నుంచి ఒక లక్షకు తగ్గుతూ వచ్చింది. అయితే, సడన్‌గా రెండవ అర్థభాగంలో 97-98 లో ఒక్క ఉదుటున రూ. 28కోట్లు కేటాయించారు. బాగానే వుందనుకొంటే, వాస్తవంలో చేసిన ఖర్చు రూ. 56 వేలు ! 99-00లో కేటాయింపు ఒక్క వెయ్యి మాత్రమే. దళిత వర్గాల నుంచి అలాంటి పాఠశాలల్లో చదివే స్థాయికి రావడమే గగనం. ఆ కొద్దిమందికీ సహాయం ఉపసంహరించడమంటే వీళ్ళు తెలివి మీరిపోతారేమోనని భయమా? బాగా చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లంటూ మరో పథకం ప్రకటించడం, కేటాయింపులు చేయడమేగాని, సగమో, మూడవవంతో ఖర్చు జరిగింది. మొదటి అర్థభాగంలో కేటాయింపులే గాని ఖర్చే లేదు. రెండవ అర్థభాగంలో 97-98లో, ఆ తర్వాత సంవత్సరంలో ఖర్చు లేనే లేదు. 99-00 లో మాత్రం మూడింట రెండు వంతులు ఖర్చు అయింది.

దళిత విద్యార్థులకు పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విషయంలో మాత్రం గత దశాబ్దం అన్ని సంవత్సరాల్లో కేటాయింపుల కన్నా అధికంగానే ఖర్చు చేశారు.

రిసెర్చి స్కాలర్లకు చేసిన కేటాయింపులు సమంజసంగా వున్నాయా అనే విషయం పక్కన పెడితే ఖర్చు మరీ అన్యాయంగా లేదని చెప్పవచ్చు. అయితే 97-98 నుంచి ఈ పద్దు కింద ఖర్చు సుమారుగా లేనట్లే.

**ప్రభుత్వ హాస్టళ్ళు**

మొదటి అర్ధ దశాబ్దంలో కేటాయింపులకన్నా ఎక్కువే ఖర్చు చేసినా (రెండు సంవత్సరాలు తప్ప) రెండవ అర్థభాగంలో ప్రతి సంవత్సరం కేటాయింపుల కన్నా ఖర్చు తక్కువగానే వుంటూ వచ్చింది.

హాస్టళ్ళలో నివసించే విద్యార్థులకు దుస్తుల సరఫరా విషయంలో కొట్టొచ్చినట్లు కనపడేదేమంటే 95-96లో, అలాగే ఆ తర్వాత సంవత్సరంలో కూడా, 1,99,000 దుస్తులకు మొదటి సంవత్సరంలో రూ. 195 లక్షలే ఖర్చు చేయగా, రెండవ సంవత్సరంలో రూ. 665లక్షలు ఖర్చు చేసారు! ఆ తర్వాత మూడు సంవత్సరాల్లో కేటాయింపులే లేవు. హాస్టళ్ళలో పదవతరగతి చదువుతూ ఫెయిల్ అయిన వారికి స్వల్పకాల కోచింగ్ పథకానికి చేసిన కేటాయింపులూ ఎపుడూ పూర్తిగా ఖర్చు చేయలేదు. అలాగే దళిత విద్యార్థులకు వృత్తి విద్యలో గైడెన్స్ నిమిత్తం 95-96 నుంచి ఒక్క సంవత్సరం తప్ప, కేటాయింపులే లేవు. కేటాయింపులు ఉన్నా అది రెండు లక్షలు ఎపుడూ దాటలేదు.

**ఇతర విద్యా సౌకర్యాలు**

ఈ గ్రూపులో సుమారు 40 పథకాలున్నాయి. ఈ పథకాలన్నింటికీ గత దశాబ్ద కాలం మొదటి అర్థభాగంలో రూ. 195 కోట్లు కేటాయించి రూ. 191 కోట్లు ఖర్చు చేయగా, రెండవ అర్థభాగంలో కేటాయించిన దానికన్నారు. రూ. 80 కోట్లు తక్కువ ఖర్చు అయింది. వీటిలో సుమారు 18 పథకాలకు అంతకుముందు నుంచి కూడా కేటాయింపులే లేవు. మొత్తం 40 పథకాలకు గత పది సంవత్సరాల్లో ఖర్చు చేసింది రూ. 600 కోట్లు అంటే సంవత్సరానికి రూ. 60 కోట్లు 40 పథకాలకు ఈ మొత్తాన్ని ఖర్చు చేసిందంటే ఒక్కొక్క పథకానికి వార్షిక సగటు ఖర్చు ఒకటిన్నర కోట్లు ! ఇందులో అధికారుల, మంత్రుల నైవేద్యాలు పోగా (ఇటీవల ప్రధాని వాజ్‌పాయ్ చెప్పిన దాని ప్రకారం రూపాయలో అయిదు పైసలే ప్రజలకు దక్కుతుంది) ఈ అణగారిన ప్రజల అభివృద్ధి వూరి పొలిమేర కూడా దాటి వుండదు. ఈ పథకాల పట్టిక చూస్తే, ఆ పథకాల మీద ప్రచారం మాత్రం ఘనంగా జరిగింది. దళితుల కోసం ఎన్నిరకాల పథకాలో అనే భావన కలుగుతుంది. ప్రభుత్వం తన వనరులన్నీ వీళ్ళకే దోచిపెట్టేస్తుందా అని అనిపిస్తుంది. కాని పై విశ్లేషణ చూస్తే పైన పటారం, లోన లొటారం అన్నట్లుంది.

ఈ పథకాల పట్టికను 90-91 నుంచి పరిశీలిస్తే (1) హాస్టళ్ళలో కిచెన్ గార్డెన్లు, నర్సరీల పెంపకం (2) యోగా, డ్రిల్లులో వార్డెన్లకు, మేట్రన్లకు శిక్షణ (3) ఆరు సంవత్సరాల లోపు బిడ్డలకు పోషకాహార సరఫరా, (4) సైన్సు ప్రదర్శనల ఏర్పాటు (50 చాలా తక్కువ అక్షరాస్యత వున్న ప్రాంతాల్లో దళితుల పిల్లలకు విద్యా కార్యక్రమాలు (6) విముక్తి హాస్టళ్ళకు సహాయం, (7) కొత్త ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు పథకాలకు పది సంవత్సరాల్లో కేటాయింపులే లేవు. వున్నా ఏదో ఒకటి రెండు సంవత్సరాలు మాత్రం నామమాత్రం కేటాయింపులు: అలాంటప్పుడు ఈ పథకాలు పట్టిక నుంచి తొలగించకుండా ఉన్నదంటే దళిత ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టడమే.

విద్యార్థులకు పలకా, పుస్తకాల సరఫరా చేస్తే వాళ్ళు పాఠశాలలకు రెగ్యులర్‌గా వస్తారనే ఆలోచనతో ప్రారంభించిన పథకం 96-97లో కేటాయింపులో సగమే ఖర్చు, ఆ తర్వాత ఒక వెయ్యి రూపాయలు మాత్రం కేటాయింపు, తదనంతరం కేటాయింపులు బంద్. ప్రభుత్వ హాస్టళ్ళలో లైబ్రరీలకు మొదటి అర్ధ దశాబ్దంలో కేటాయింపులు, ఖర్చులు సుమారుగా సమంగానే వున్నాయి. 95-96 నుంచి విజ్ఞాన సూర్యుడు అస్తమించడం ప్రారంభమైంది. ఆ సంవత్సరంలో రూ. 33లక్షలు కేటాయించి ఒకటిన్నర లక్షలు, ఆ తర్వాత సంవత్సరంలో కేటాయింపులో సగం ఖర్చు చేసి, తదనంతరం ఆ పథకానికి గుడ్‌బై చెప్పేసింది. బహుశా విద్యార్థులు తెలివిమీరిపోతుండి వుండాలి. అలాగే హాస్టళ్ళలో నివసించే విద్యార్థులకు ఆటల పోటీలు, స్టడీ టూర్స్, ఎక్స్‌కర్షన్స్ లాంటి పథకాలన్నీ 97-98 నుంచి అటకెక్కించేశారు. ఒక్క రెసిడెన్షియల్ సెంట్రలైజ్డ్ పాఠశాలలకు మాత్రం కేటాయింపులూ, ఖర్చులు ఘనంగానే వున్నాయి. మిగతా పథకాలన్నింటి గురించి వ్రాయాలంటే ఓ గ్రంథమే అవుతుంది. వ్రాసినా, చెప్పుకోవడానికే ముందని? కడుపు చించుకొంటే కాళ్ళమీద పడుతుంది.

**ఆరోగ్యం కోసం :**

షెడ్యూల్డ్ తరగతుల ఆరోగ్యం కోసం ఏదో వండి వొరగబోస్తున్నట్టు మాట్లాడుతుంది ప్రభుత్వం. కాని ఈ పట్టిక చూస్తే రెండే రెండు పథకాలున్నాయి. బై-పాస్ సర్జరీ చేసుకున్న వారి సహాయార్థం 10 సంవత్సరాల్లో ఒక్క సంవత్సరంలో మాత్రం రూ. 32వేలు ఖర్చు చేసింది. ఇంతటితో పథకం కథ సమాప్తం. గ్రామీణ ఆరోగ్య పథకం రెండోది. అది అలంకార ప్రాయం మాత్రమే. ఖాతాను ప్రారంభించాలనే లేదు.

దళితులను ఉద్ధరించాలంటే ఆర్థికంగా వారికి చేయూత ఇవ్వడం అవసరం. ఆర్థికంగా వారికి బలం చేకూరిస్తే, సామాజికంగా కూడా వారి స్థితి బాగుపడుతుంది. ప్రభుత్వం కూడా వీరిని ఉద్ధరించడానికే తాము పుట్టినట్లు మాట్లాడుతుంది. మీ కోసమే అన్నట్లు ప్రత్యేకంగా ఓ కార్పోరేషన్ ఏర్పాటుచేసి ఆర్భాటంగా పనిచేయడం ప్రారంభించింది. ఆర్థికంగా సహాయం అంటే వాళ్ళకు

*(తరువాయి 12వ పేజీలో .....)*

# దళితులు - రాష్ట్ర బడ్జెట్లు

...✍ సౌరంపల్లి

రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన దళితుల, గిరిజనుల, మైనార్టీ మరియు వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, సంక్షేమానికి బడ్జెటు కేటాయింపులు చేస్తున్నది. ఈ వర్గాలు సమాజంలో అత్యంత వెనుకబడినవని ప్రభుత్వం గుర్తిస్తూనే, వీరిని సమాజంలో గుర్తింపు పొందిన పౌరులుగా అభివృద్ధి చేయడానికి ఈ బడ్జెట్లు వినియోగిస్తున్నానని చెప్తున్నారు. అయిదు దశాబ్దాలు గడచినా, ప్రతి సంవత్సరం బడ్జెట్లు కేటాయించే ఈ వర్గాల ఆర్థిక, సాంఘిక స్థితి మాత్రం మారడం లేదు. నిరంతరం బలహీన వర్గాల సంక్షేమం జపిస్తున్న పాలకవర్గాలు ఎన్నికల సందర్భంగా మరిన్ని వరాలు గుప్పించి, ఓట్లు సంపాదించి వీరి మానాన, వీరిని వదిలివేస్తున్నారు. పాలకవర్గాలు వీరిని ఓటు బ్యాంకులుగా చూస్తున్నాయే తప్ప వీరి అభివృద్ధికి మాత్రం పని చేయడం లేదనేది చరిత్ర చెబుతున్న వాస్తవం - ముఖ్యంగా దళితుల స్థితి మరింత అధ్వాన్నం - రాష్ట్ర బడ్జెట్లలో వీరి పాత్ర ఎంత? ఏ మేరకు వీరికి ఉపయోగపడ్తున్నాయో పరిశీలిస్తే పాలకవర్గాల నైజం అర్థం చేసుకోవచ్చు.

2001 జనాభా లెక్కల ప్రకారం దళితుల జనాభా రాష్ట్రంలో 123.39 లక్షలుగా ఉంది. రాష్ట్ర మొత్తం జనాభాలో వీరు 16.19 శాతంగా ఉన్నారు. గ్రామాలలో ఊరి చివర, పట్టణాలలో మురికివాడలలో వీరి నివాసం. వీరికి రాష్ట్ర సాగు విస్తీర్ణంలో 7శాతం భూమి మాత్రమే ఉంది. దళితులలో 80శాతం వరకు ఎలాంటి భూమి గాని, స్థిరాస్తులు గాని లేనివారే - వీరి కున్న భూములపై కూడా హక్కులు నామమాత్రమే - ప్రభుత్వం ప్రకటించే ఏ పథకం చూసినా వీరికే ప్రాధాన్యత ఇచ్చినట్లు మొదట అంకెలు చెపుతారు. కాని ఆచరణలో వీరికి ఏ పథకాలు మాత్రం వర్తించవు - రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా శాఖను ఏర్పరిచి అందులో అయిదు ఉపశాఖల ద్వారా తొమ్మిది సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నవి.

**ఉపశాఖలు :**

1. సంక్షేమ కమీషనర్ (విద్య, ఉద్యోగాలు, సంక్షేమ కార్యక్రమాలు)
2. దళిత కార్పొరేషన్
3. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు
4. ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్స్
5. పౌర హక్కుల పరిరక్షణ విభాగం

వీటి ద్వారా ఈ దిగువ కార్యక్రమాలు కొనసాగిస్తారు.

1. విద్య. 2. సాంఘికాభివృద్ధి 3. సంక్షేమ అభివృద్ధి 4. అనాథ బాలల సదనాల నిర్వహణ 5. జోగినీ వ్యవస్థ నిర్మూలన 6. వెట్టి చాకిరి నుండి విముక్తి 7. స్కావెంజర్ల పునరావాసం 8.పేద వితంతువులకు పెన్షన్లు 9. ఇండ్ల స్థలాల పంపిణీ.

వీటి నిర్వహణకు రాష్ట్ర కేంద్రంలోను, జిల్లాల్లోను 10079 మంది సిబ్బంది (మార్చి 2004 నాటికి) పని చేస్తున్నారు. ఇందులో 6724 మంది అటెండర్లు, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్లు, వంట వారు, వాచ్‌మెన్లు ఉన్నారు. మరో 3087 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులే. వీరు పోను 268 మంది మాత్రమే అధికారులుగా ఉన్నారు. ప్రతి జిల్లాలో ఒక డిప్యూటి డైరెక్టరు ఉంటారు. వీరి ద్వారా దళిత జనోద్ధరణ సాగాలి. కోటి ఇరువది మూడు లక్షల మందికి వీరి సేవలు అందాలి. రాష్ట్రంలో 57 గ్రామాల (28 వేల గ్రామ పంచాయితీలు) లో దళితులకు సేవలు చేయడానికి ఈ సంఖ్య ఏ మాత్రం సరిపోదు - 31 జనవరి 2003 నాటికి ఇందులో 802 ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నాయి. తగిన అభ్యర్థులు లేరని ప్రభుత్వం చెప్పుచున్నది. ఒక వైపున ఉద్యోగాల కొరకు దళితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా మరోవైపున అర్హత గల్గిన వారు లేరని చెప్పడం ప్రభుత్వానికే చెల్లింది. ఈ ఉద్యోగ ఖాళీలు ఇతర వర్గాలకు అంట గట్టడానికే ఈ ఎత్తుగడగా భావించాల్సి వస్తుంది. కొన్ని శాఖలలో నిర్ణీత సంఖ్యకు మించి, అవసరానికి మించి ఉద్యోగాలు కల్పించి ప్రభుత్వానికి దళిత ఉద్యోగాలు ఖాళీలుగా ఉంచి ఆ నిధులను డైరెక్షన్ చేయడానికి వినియోగించవచ్చు. ఏ వర్గ సంక్షేమానికి ఆ వర్గం వారికే ఉద్యోగాలివ్వడం వలన వారి కష్టసుఖాలు అర్థం చేసుకొనే వీలుంటుంది.

**విద్యారంగం :**

మొత్తం దళితులలో చదువుకున్న వారు31.58 శాతం మంది మాత్రమే. మహిళలు 17.12 శాతం మాత్రమే. 52 శాతం మంది కార్మికులు గానే కాలం వెళ్ళదీస్తున్నారు. బాల కార్మిక విధానం ప్రబలంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో బాలికల చదువునేటికి ఊహించడమే కష్టం కాని రాష్ట్ర బడ్జెటులో దళితులకు విద్యారంగంపై కేటాయింపులు తగినంత చేసి అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుచున్నది. 1983లో మొదటిసారిగా 43 రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించారు. ఇవి కాక 2313 హాస్టళ్ళు నిర్వహిస్తున్నారు. కాని భవనాలు 2210కే ఉన్నాయి. ఆ హాస్టల్ భవనాల నిర్వహణ అధ్వాన్నంగా ఉంటుంది. పర్యవేక్షణ తక్కువ - మూడు మాసాలకొకసారి పిల్లల తల్లిదండ్రుల సమావేశాలు జరుపుతున్నట్లు, పిల్లల ఆరోగ్య పరీక్షలు జరుపుచున్నట్లు బడ్జెటు పత్రాలలో చెప్పారే తప్ప ఆచరణ మాత్రం లేదు. ప్రస్తుతం 2.75 లక్షల మంది విద్యార్థులు మాత్రమే హాస్టళ్ళలో ఉన్నారు. వీరికిచ్చే రేషన్ పరిశీలించండి.

సంవత్సరానికి 2 జతల దుస్తులు
నెలకు రూ. 270లు ఆహారం క్రింద (7వ తరగతి)
నెలకు రూ. 330లు అలంకరణకు (10వ తరగతి)
నెలకు రూ. 20లు అలంకరణకు (బాలురు)
నెలకు రూ. 25 అలంకరణ (బాలికలకు)

పై రేట్లను 1-6-1999 నుండి అమలుచేయాలని 3-5-1999న జి.వో.నెం. 39ని జారీ చేసారు. 10వ తరగతి తర్వాత విడిగా ఉంటే నెలకు రూ.190లు, హాస్టల్‌లో ఉంటే నెలకు రూ. 450లు ఇస్తామన్నారు. ఇక్కడొక విషయం గమనించాలి -7వ తరగతి విద్యార్థి, 10వ తరగతి విద్యార్థి కాని, 10వ తరగతి ఉత్తీర్ణుడైన విద్యార్థి కాని ఆహారవ్యయంలో తేడా ఉండదు. - ఖర్చు అందరికీ సమానంగానే ఉంటుంది. మరి ప్రభుత్వం విధానం ప్రకారం తరగతిని బట్టి ఆహారం తీసుకోవాలేమో ! అలంకరణకిచ్చే రూపాయలు నెలకు నెత్తికి నూనెకే సరిపోవు. ఇక బట్టలు శుభ్రపరిచి, తాను శుభ్రంగా ఉండడం సాధ్యమవుతుందా? ఈ సౌకర్యాలు ఉన్నత వర్గాలకిస్తే సరిపుచ్చుకుని

చదువు సాగిస్తారా? రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 80.41 కాగా 10వ తరగతి హాస్టల్స్‌లో ఉన్న దళితులు గత 6 సంవత్సరాలుగా 85 వరకు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కాని ఏం లాభం? ఉన్నత చదువులకు వెళ్ళే ఆర్థిక సౌకర్యం గగన కుసుమాలే కదా? ఇదీ విద్యారంగానికి ప్రభుత్వ కేటాయింపు.

**సంక్షేమ పథకాలు (2002 - 03)**

జోగిని వ్యవస్థ నిర్మూలనకు, స్కావెంజర్ల విముక్తికి, వెట్టి చాకిరి నుండి విముక్తికి 15,478 మందికి పునరావాసం క్రింద రూ. 30.95 కోట్లు పంపిణీ చేశారు. అదే విధంగా మాక్రో పరపతి సూక్ష్మ సహకారం క్రింద 15675 మంది రూ. 8 కోట్లు లబ్దిదారులకు పంపిణీ చేసారు. 1,26,216 ఇండ్ల స్థలాల పంపిణీ చేశారు. ఈ పథకాల వల్ల లబ్దిదారులకు వచ్చేదెంత? ఈ నిధులతో వారు నిజంగానే విముక్తి ఔతారా? ఆలోచించాలి. ఇది ప్రచారానికి పనికివచ్చే పథకమే తప్ప సంక్షేమ పథకం మాత్రం కాదనేది ప్రభుత్వ గణంకాలే చెబుతున్నాయి.

దళిత సహకార కార్పోరేషన్ కుటీర పరిశ్రమలకు, గ్రామీణ పరిశ్రమలకు చిన్న వ్యాపారులకు సంబంధించి అధ్యయన సంస్థను నెలకొల్పింది. జిల్లాలలో 23 కార్పోరేషన్లున్నాయి. - మార్చి 2004 నాటికి ఈ కార్పోరేషన్లకు రాష్ట్రప్రభుత్వం రూ. 144.46 కోట్లు, కేంద్రప్రభుత్వం 130.86 కోట్లు వాటా ధనంగా మొత్తం రూ. 275.32 కోట్లు ఇచ్చారు. 1974 లో స్థాపించినప్పటి నుండి ఈ నిధులతో 35 లక్షల కుటుంబాలకు మార్జిన్‌మని సబ్సిడీ ఇస్తూ సహకరించి, బ్యాంకు ద్వారా రుణాలిప్పించాలి. వాటా ధనంపై వచ్చిన వడ్డీతో మార్జిన్ సబ్సిడి ఇవ్వాలి.

2002-03లో 89.30 లక్షలు మార్జిన్ సబ్సిడి ఇచ్చారు.

2003-04లో 100.50 లక్షలు కేటాయించారు.

2004-05లో 98.56 లక్షలకు ప్రతిపాదన సిద్ధం చేశారు.

ఈ మార్జిన్ సబ్సిడీతో బాంకులు రుణాలివ్వడానికి ముందుకు రావడం లేదు. కేంద్రం కూడా కొన్ని పథకాలకు ఆర్థిక సహకారం చేసింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తన నిధులుగా చెప్పుకొని పేరు మార్చింది.

**కేంద్ర పథకాలు :**

2002-03లో రూ. 51.81 కోట్లు ఇచ్చింది.

2003-04లో రూ. 75.00 కోట్లు కేటాయింపు

2004-05లో రూ. 75.00 కోట్లు ప్రతిపాదన

ఈ పథకాలకు ముందడుగు, చేయూత అంటూ పేర్లు పెట్టి ప్రచారం చేశారే తప్ప నిధులు మాత్రం విడుదలకాలేదు. ఆదరణ పథకం నిరాదరణకు గురైంది. చివరకు ఈ నిధులు కూడా డైరెక్షన్ అయ్యాయి. ఈ పథకాలేవి దళితులను దారిద్ర్య విముక్తుల్ని చేయలేక పోయాయి. ఈ కేటాయింపులు ఎన్ని కుటుంబాలకు ఉపయోగపడ్డాయి. ఇందులో అవినీతి పాత్ర ఎంత?

రాష్ట్ర బడ్జెట్‌ను పరిశీలిద్దాం. మొత్తం సిబ్బంది జీతభత్యాలు, సంక్షేమం కల్పి దళితులకు, గిరిజనులకు, మైనార్టీలకు, బలహీనవర్గాలన్నింటికి బడ్జెటు కేటాయింపు ఈ విధంగా ఉన్నాయి.

| సంవత్సరం | రెవిన్యూ వ్యయం (రూ. కోట్లలో) |
|---|---|
| 1990-91 | రూ. 350.20 |
| 1991-92 | రూ. 415.43 |
| 1992-93 | రూ. 460.10 |
| 1993-94 | రూ. 449.89 |
| 1994-95 | రూ. 513.91 |
| 1995-96 | రూ. 539.13 |
| 1996-97 | రూ. 577.93 |
| 1997-98 | రూ. 630.59 |
| 1998-99 | రూ. 794.46 |
| 1999-2000 | రూ. 784.08 |
| 2000-01 | రూ. 980.43 |
| 2001-02 | రూ. 947.99 |
| 2002-03 | రూ. 993.71 |
| 2003-04 | రూ. 1222.65 |

ఇందులో ప్రణాళికేతర ప్రణాళికా బడ్జెట్లు కల్పి ఉన్నాయి. ఈ మొత్తం బడ్జెటులో 3శాతంకు మించదు. వీరితోనే శాఖల నిర్వహణ, సంక్షేమ పథకాలు అమలుచేయాలి. రాష్ట్ర బడ్జెటు రూ. 45 వేల కోట్లకు చేరుకుంది. ఈ కేటాయింపులలో దళితుల వాటాతో వారి అభివృద్ధి సాధ్యమయ్యేనా? పైగా ఈ బడ్జెటుతో దళిత, గిరిజన, మైనార్టి బలహీనవర్గాల వారందరికి సంక్షేమ పథకాలు చేపట్టాలి. ఇందులో దళితుల భాగస్వామ్యమెంత?

**స్టడీసర్కిల్స్**

వార్షికాదాయం రూ. 44500/- కంటే తక్కువ యున్న దళిత, గిరిజన, బిసి విద్యార్థులకు UPSC, సివిల్ సర్వీసు పరీక్షలకు హైదారాబాద్‌లో 70మందికి, విశాఖపట్నంలో 70మంది స్టడీసర్కిల్స్ నిర్వహిస్తారు. ఒక్కొక్కరికి నెలకు రూ. 600లు. స్టైఫండు నిర్వహణకు, ఉచిత హాస్టల్ వసతి, ప్రిమిలినరి పరీక్షకు రూ. 1500లు మెటీరియల్ కోచింగ్‌కు రూ. 2000లు. వైద్యానికి రూ. 200లు ఇస్తారు. 1980 నుండి 2003 వరకు 327 మంది అభ్యర్థులు ఎన్నికైనారు. ఏటా అధ్యయన కేంద్రాల నిర్వహణకు రూ. 35 లక్షలు మాత్రమే కేటాయిస్తారు. దీనికి బంజారాహిల్స్‌లో 1.47 కోట్లతో భవన నిర్మాణం చేసారు. ఈ స్టడీ సర్కిల్స్ ఎంతమంది అవసరాలు తీరుస్తాయి. వ్యక్తిగతంగా ఇతర విద్యార్థులు ఒక్కరే రూ. 30 లక్షల వరకు స్వయంగా వ్యయం చేస్తున్న ఘటనలు మనం చూస్తున్నాం. ఇది అభివృద్ధికి కేటాయింపు.

**సంక్షేమం రక్షణ**

1955 పౌర హక్కుల చట్టం, 1989 అత్యాచారాల నిరోధక చట్టం క్రింద అంటరానివారుగా చూచినా, వారిపై అత్యాచారాలు జరిపినా రూ. 500లు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష ఉంది- ఇదేమంత పెద్ద శిక్ష కాదు. అయినా 1955 చట్టం క్రింద ఉన్న కేసులు, 1989 దళిత చట్టం క్రింద కేసులు పరిష్కారాలు కావడం లేదు.

| వివరం | **1955** పి.సి.ఆర్ చట్టం ప్రకారం | **1989** పిఒఎ చట్టం ప్రకారం |
|---|---|---|
| 1-1-2003 నాటికిపెండింగ్ కేసులు | 294 | 2467 |
| 2003లో హాజరైన కేసులు | 218 | 1558 |
| **మొత్తం** | **512** | **4025** |
| దోషిగా నిర్ణయించిన కేసులు | 19 | 91 |
| పరిష్కరించిన కేసులు | 258 | 1576 |
| 2003 చివర పెండింగ్ కేసులు | 254 | 2449 |

ఈ కేసుల పరిష్కారాలు "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుంది. రిజష్టరీ కాని కేసులు వందలు, వేలలో ఉంటాయి. అనేక ఉద్యమాల ఫలితంగా గత ప్రభుత్వం జస్టిస్ కె. పున్నయ్య కమీషన్ వేసింది.

ఈ కమీషన్ దిగువ సిఫార్సులు చేసింది.

1. శాశ్వత ఎస్.సి - ఎస్.టి కమీషన్ ఏర్పాటు
2. ఎస్.ఐ హోదా కల్గిన స్థాయి అధికారి ప్రతి వారం గ్రామాలు దర్శించడం
3. గ్రామంలో ప్రతి నెల 30వ తేదీని పౌరహక్కుల దినంగా జరపడం
4. అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన వారికి ఏప్రిల్ 14న అవార్డులు ఇవ్వడం.
5. భూమి, కనీసవేతనాలు, వెట్టిచాకిరి, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన అంశాల నివారణకు విభాగాల ఏర్పాటు.
6. ప్రతి పోలీసుస్టేషన్‌లో ఎస్.సి, ఎస్.టి విభాగం ఏర్పాటు.
7. జిల్లా స్థాయి అనధికార సలహాసంఘం

(PAO-1) శాఖ ఎం.ఎస్ నెం. 92 జి.వో తేది 3-10-2001 ప్రకారం కమీషన్‌ను నియమించగా ఆ కమీషన్ 14-11-2003 నుండి కార్యకలాపాలు ప్రారంభించింది.

ఇతర సిఫార్సుల అమలుకు ఇంతవరకు కృషి ఎంతమేరకు జరిగిందో ప్రభుత్వమే చెప్పాలి. ఆచరణలో మాత్రం గతంపై గణనీయమైన మార్పులేమీ రాలేదు. అత్యాచార బాధితులకు ఇచ్చిన పరిహారం చూడండి.

| సంవత్సరం | కేసుల సంఖ్య | పరిహారం (లక్షలలో) |
|---|---|---|
| 1998-99 | 1127 | 453.46 |
| 1999-00 | 891 | 160.01 |
| 2000-01 | 332 | 97.34 |
| 2001-02 | 533 | 123.41 |
| 2002-03 | 473 | 223.04 |
| 2003-04 | 1331 | 143.91 |

సగటున చూస్తే రూ. 20వేల లోపే ఇవ్వడం జరిగింది. నేరానికి గురైనవారి మానసిక క్షోభ పాలకులకు తెలిసినట్లు లేదు.

కులాంతర వివాహాలకు రూ. 10,000 సహాయం ప్రకటించారు. - దీనికి అనేక పత్రాలు, రుజువులు ఇచ్చి, అధికారులను సంతృప్తి పరిచేవరకు తల ప్రాణం తోకకువస్తుంది. కమ్యూనిటీహాళ్ళ నిర్మాణాలకు జిల్లాకు రూ. 3లక్షల వ్యయం కోసం బడ్జెటు కేటాయింపు ఉంది. 2003-04లో రూ. 4లక్షల వ్యయంతో 327 చిన్న కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం చేపట్టినట్లు 2004-05 బడ్జెట్‌లోపే పేర్కొన్నారు.

ఇదీ దళితుల ఉద్ధరణకు, సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెటు - కోటి ఇరువది మూడు లక్షల మందిలో కనీసం 90శాతం ప్రజలు నిరంతర దారిద్ర్యం, చదువులేమి, పౌష్టికాహార లేమితో బాధలు పడ్తుండగా వారి అభివృద్ధి ఈ విధమైన బడ్జెటులతో సాధ్యమయ్యేనా? మనం వారిని (దళితులను) సమాజంలో గౌరవం గల వ్యక్తులుగా అభివృద్ధి చేయగలమా? అందరం ఆలోచించాలి. అనుత్పాదకరంగం మీద వేల కోట్లు వ్యయం చేస్తున్న ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ వర్గం అభివృద్ధికి కావాల్సిన లక్ష్యం మేర బడ్జెట్ కేటాయించ లేదా? నాయకులంతా చెబుతున్నట్లు ఉద్యమాలే మనకు కావాల్సిన బడ్జెటును పెంచడానికి దోహదపడ్తాయి తప్ప బ్రతిమిలాటద్వారా సాధ్యం కాదనేది చరిత్ర చెప్తున్న వాస్తవం.

( 9వ పేజీ తరువాయి ..... )

భూపంపకం, వాటిని దున్నుకోవడానికి ఆర్థికసహాయం, ఇళ్ళ నిర్మాణం, ఉద్యోగ వసతి కల్పన, రుణ సౌకర్యం లాంటివన్నీ అని మనమంతా అనుకొంటాం. ప్రభుత్వం కూడా అలాగే అనుకుంటున్నామని అంటూంటుంది. కాని ఆచరణలో షరా మామూలే. గత దశాబ్దం మొదటి సంవత్సరంలో రూ. 31 కోట్లు ఖర్చు చేస్తే 2000 సంవత్సరంలో ఖర్చు చేసింది కేవలం రూ. 15 కోట్లు ! (కేటాయింపు మాత్రం ఆర్భాటంగా రూ. 76 కోట్లు చేశారు. ఇలా అయిదు రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పి ఒక రూపాయే ఖర్చు చేసిన ప్రభుత్వాన్ని ఏమనాలి?) ఈ కేటాయింపులో సగభాగం కేంద్రం నుంచే వస్తుంది. ఉదాహరణకు 98-99లో ఈ పథకానికి చేసిన మొత్తం ఖర్చు రూ. 38 కోట్లలో రూ. 20కోట్లు కేంద్రాన్నుంచే వచ్చింది. ఈ పద్దుకింద విచిత్రమేమంటే 97-98లో రూ. 30 కోట్లు మాత్రమే ఖర్చు చేసి 79 వేల మందికి సహాయం చేస్తే ఆ తర్వాత సంవత్సరంలో రూ. 20 కోట్లు మాత్రమే ఖర్చు చేసి 79 వేలమందికి సహాయం చేశారట. బహుశా ఇదేదో గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాల్సిన అద్భుతం. వీళ్ళకు పంచి పెట్టిన భూముల అభివృద్ధికి అంతకుముందు కాస్తా, కూస్తో, ఖర్చవుతూండేది. కాని 96-97 తర్వాత ఈ పథకానికి మార్చింగ్ ఆర్డర్ ఇచ్చేసింది.

**ఎక్కువ, తక్కువ ఖర్చు**

ప్రభుత్వం ప్రతి బడ్జెట్ సమావేశంలో ఆ సంవత్సరపు ఆదాయ వ్యయాల అంచనాలతో పాటు అంతకు రెండు సంవత్సరాల క్రితం వాస్తవంగా కేటాయించిన సొమ్ము, చేసిన ఖర్చు గురించిన నికరలెక్కలను చూసిన ఆడిటర్ - జనరల్ తయారుచేసిన ఒక నివేదికను కూడా సభ్యులకు అందజేస్తారు. ఈ నివేదికలో కేవలం చేసిన కేటాయింపుకన్నా ఎక్కువగాని, తక్కువగాని ఖర్చు చేసినట్లయితే, ఆ పథకాల గురించిన పూర్తి వివరాలిస్తారు. ఉదాహరణకు 1999-2000 సంవత్సరం నివేదిక చూస్తే సుమారు మూడున్నర లక్షలు, ప్రభుత్వ హాస్టళ్ళు రూ. 15 లక్షలు,బుక్ బాంకులు రూ. 53 లక్షలు, ఎస్సీ వాడల్లో లైబ్రరీలు రూ. 35లక్షలు, అపరిశుభ్ర వృత్తుల్లో పనిచేసేవారి పిల్లలకు స్కాలర్‌షిప్పులు రూ. 12లక్షలు, కొన్ని ప్రత్యేక కోర్సులు చదివేవారికి స్టయిఫెండ్‌లు సహాయం రూ. 11లక్షలు, ఐటిఐ ఇంజనీరింగ్ విద్యార్థులకు కాలుక్యులేటర్లు, ఇతర వస్తువుల కొనుగోలు రూ. 26 లక్షలు, రూ.26 లక్షలు, ఇళ్ళ స్థలాల కోసం భూమి సేకరణ, ఆ భూమి అభివృద్ధి, వాటి మీద ఇళ్ళ నిర్మాణం కోసం సహాయం రూ. 299 లక్షలు, ఎస్సీల మీద అత్యాచారాల సందర్భంలో న్యాయ సహాయం రూ. 86లక్షలు , ఎ.పి స్టడీసర్కిల్ రూ. 13లక్షలు, ఇళ్ళ స్థలాల సేకరణ రూ. 88లక్షలు సహకార ఫైనాన్స్ కార్పోరేషన్‌లో పెట్టుబడులు రూ. 793లక్షలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం రూ. 210 లక్షలు, గోదాముల నిర్మాణం రూ. 45 లక్షలు ఖర్చు కాకుండా మురిగిపోయాయి. ప్రతి సంవత్సరం ఇలా ఖర్చు కాకుండా మిగిలిపోయే మొత్తం కొన్ని కోట్లలో వుంటుంది.

55 సంవత్సరాల తర్వాత కూడా ఎస్సీల పరిస్థితులు ఇలా వుండడం దారుణమైన నేరం. నేరాన్ని అదుపు చేయాల్సింది ప్రభుత్వం. కాని ప్రభుత్వమే నేరాన్ని పెంచిపోషిస్తుంటే, నేరాలకు బలి అవుతున్న వారు తమను రక్షించుకోవడానికి సిద్ధం కావడం తప్ప మరో మార్గం లేదు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడడం ఇప్పటివరకు జరిగిన కథ.

ఈ కథ ఇక మలుపు తిరగాలి.

*(దళిత సంక్షేమం పుస్తకం సౌజన్యంతో)* ●

# సునామీ కారణంగా ప్రకాశం, నెల్లూరు, కృష్ణ మరియు తూర్పుగోదావరి జిల్లాల్లో బాధితులైన దళిత, ఆదివాసీ, ముస్లింలకి సంబంధించిన ప్రాథమిక నివేదిక

గత 2004 డిసెంబర్ 29 మరియు 30 తేదీల్లో అంకురం సంగమం ఫోరం మరియు దళిత బహుజన శ్రామిక యూనియన్ పనిచేస్తున్న గ్రామాల్లోని సునామీ బాధితుల్ని డా॥ శిరివెళ్ళ ప్రసాద్ (డైరెక్టర్ సాక్షి హ్యూమన్ రైట్స్ వాచ్ ఎ.పి) బెజవాడ విల్సన్ (కన్వీనర్ యస్.కె.ఎ) మరియు డేవిడ్ సుధాకర్ (రీసెర్చ్ అసోసియేట్ యన్.సి.డి.హెచ్.ఆర్) లతో కూడిన నిజనిర్ధారణ బృందం కలవడం జరిగింది. అలాగే ఈ బృందం నెల్లూరు జిల్లా కలెక్టర్‌ని కూడా కలిసారు.

సునామీ ప్రకాశం జిల్లాలోని 17 గ్రామాలను నెల్లూరు జిల్లాలోని 102 గ్రామాలను దెబ్బతీసింది. సముద్రతీరానికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో ఆస్తి నష్టం భారీగా సంభవించింది. సముద్రతీరంలోని అలలతాకిడికి 26 డిసెంబర్ 8గం॥ల ప్రాంతంలో ప్రకాశం జిల్లాలో 38 మంది నెల్లూరు జిల్లాలో 80 మంది ప్రాణాలు కోల్పోయారు.

**ప్రకాశం జిల్లా**

నిజనిర్ధారణ బృందం ప్రకాశం జిల్లాలోని ఊళ్ళపాలెపు జాలరి గూడాన్ని మరియు దళిత కాలనీని సందర్శించింది. జాలరి గూడానికి బియ్యం మందులు సరిపోయిన విధంగానే అందాయి. కానీ దళిత కాలనీని అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. నిజానికి ఆ రోజు జిల్లా కలెక్టర్ ఆ ప్రాంత ఎమ్.ఎల్.ఎ మరియు యం.పి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వాళ్ళు కూడా దళితకాలనీని సందర్శించలేదు.

దళిత కాలనీని సందర్శించిన బృందం దళితులకి జరిగిన నష్టాన్ని అంచనావేసి వారికి అందిన సహాయాన్ని గమనించింది. సముద్రతీరంలోని 175 ఎకరాల్లో ఆ గ్రామానికి చెందిన 500 దళిత కుటుంబాలు ఉప్పు సాగుచేస్తుంటాయి. దళితేతరులకి పక్కా ఇళ్ళు ఉన్నాయి. గత 20 సం॥రాలుగా అక్కడి దళితులు "బింగినపల్లి షెడ్యూల్డు కులాల ఉప్పు సాగుబడి సంఘం" ను స్థాపించుకొని జీవనోపాధిని పొందుతున్నారు. సునామీ వచ్చిన 26డిసెంబర్ 8గం॥ల సమయంలో దాదాపు 20 మంది స్త్రీ, పురుషులు తమ భూముల్లో ఉప్పును అమ్ముకోవడానికి గోతాలకి ఎత్తుతున్నారు. సునామీ అల వారిపై పడగానే అదృష్టవశాత్తు వారు పరిగెత్తి ప్రాణాలు దక్కించుకున్నారు. 26 డిసెంబర్ తర్వాత దళితులు జీవనోపాధిని కొల్పోయారు. వారి భూములు ఉప్పు సాగుదలకి పనికిరాకుండా పోయాయి. దళితులు చాలామంది వడ్డీకి డబ్బులు తెచ్చి ఆ పొలాల్లో పెట్టారు.

జాలరి కుటుంబాలకి దళిత కుటుంబాలకి నడుమనున్న తేడాలు ఒకసారి పరికిస్తే చాలు తెలిసిపోతాయి. జాలరికుటుంబాలకి పక్కా గృహాలు ఉన్నాయి. దళితుల్లో ఎవరికీ పక్కా గృహాలు లేవు. రెవిన్యూ అధికారులు సునామీ కారణంగా జాలరి కుటుంబాలకి తప్ప మరెవరికీ ఎలాంటి నష్టం జరగలేదని చెబుతున్నారు.

ప్రభుత్వాధికారులు సునామీకారణంగా ఊళ్ళపాలెంలో దెబ్బతిన్న పడవలు, వలలు విలువ కొన్ని లక్షల్లో అన్ని తేల్చేసారు. కానీ దళితుల్ని పరిగణనలోకి తీసుకోలేదు. దళిత రైతులు నిజనిర్ధారణ బృందానికి తెలిపిన లెక్కల ప్రకారం సునామీ కారణంగా వారి నష్టం 50 లక్షలుగా తేలింది ఆ లెక్కలు క్రింది విధంగా ఉన్నాయి.

| | |
|---|---|
| 1. పొలాల్లో కోల్పోయిన ఉప్పు | 21.87 లక్షల రూపాయలు |
| 2. ఇసుక తొలగింపుకి అయ్యేఖర్చు | 26.25 లక్షల రూపాయలు |
| 3. కోల్పోయిన వేతనాలు | 8.19 లక్షల రూపాయలు |
| **మొత్తం : 56.31 లక్షల రూపాయలు** | |

శతాబ్దాలుగా వివక్షకి, అంటరానితనపు అవమానాలకి గురైన దళితులు జీవనోపాధి కోసం, హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నారు. కనీసం సునామీ పునరావాస కార్యక్రమాల పర్యవేక్షణ అమలులోనన్నా తమకు న్యాయం చేయవలసినదిగా అక్కడి దళితులు కోరుతున్నారు.

**కృష్ణా జిల్లా**

డిబియస్‌యు జిల్లా కార్యదర్శి ప్రకాష్ కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను గ్రామబాధిత దళితుల్ని కలవడం జరిగింది. వారు సంఘటన జరిగిన మూడురోజులకి కూడా తమని పలకరించే నాధుడు కరువైనాడని వాపోతూ తక్షణ పునరావాసం, సహాయచర్యల కోసం యం.ఆర్.వోకి తమ వినతిపత్రాన్ని అందజేసారు. సర్పంచ్ పంచుతున్న సహాయ సామాగ్రిని కూడా అడ్డుకుంటామని చెప్పారు.

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం మండలం గిలకల దిండి గ్రామంలో జాలర్లకు యం.ఆర్.ఓ 25 కిలోల బియ్యం మరియు 750/- రూ॥లు పంచడం జరిగింది. కానీ అదే సహాయాన్ని ఆ గ్రామంలోని 24 దళిత కుటుంబాలకి మాత్రం అందించలేదు. ఆ 24 దళిత కుటుంబాలు కూడా సముద్రం పైన ఆధారపడి తమ జీవనాన్ని గడుపుతున్నారు.

మచిలీపట్నం మండలంలోని నిడమర్రు గ్రామం దళితులు చిన్న చిన్న నీటి కుంటల్లో ఎండ్రకాయలు పెంచి అమ్ముకొనేవారు. అదేవిధంగా సముద్ర తీరప్రాంతంలో గవ్వలు ఏరుకొని అమ్మేవారు.

## సమసిపోని అంటరానితనపు గబ్బు

30వ తేదీ సాయంత్రం నాగపట్నంలో సునామీ కారణంగా బాగా దెబ్బతిన్న ప్రాంతాన్ని మేము సందర్శించాము. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మృతులు 7000 మంది అని తేల్చారు. అక్కడ పనిచేస్తున్న యన్.జీ.వోల మరియు అనధికార వర్గాల లెక్కల ప్రకారం మృతులు 14,000 వరకు ఉండొొచ్చని అంచనా. చాలా శవాలు ఇసుకలో మరియు చిల్ల పెంకుల క్రింద పాతిపెట్టబడ్డాయి. తిరుచ్చి, పళని, పొలాచ్చి మరియు మదురైల నుండి తీసుకొచ్చిన 700 మంది సఫాయి పనివాళ్ళతో ప్రభుత్వ యంత్రాంగం శవాలని పాతిపెట్టించే పనిలో నిమగ్నమై ఉంది.

సునామీ బాధిత ప్రాంతాల్లో సఫాయి పనివాళ్ళకి అప్పగించబడిన పని ఏమంటే కుళ్ళిపోయి దుర్గంధ భరితమై ఉన్న శవాల్ని చేతులతో ఎత్తుకెళ్ళి పాతిపెట్టడం. వీరిపని ఉదయం 6.30ని॥లకు మొదలై సాయంత్రం 6.30వరకు పూర్తిగా చీకటి పడేదాకా కొనసాగుతుంది. వీరిపని నిరంతరాయంగా 12గం॥ల పాటు మధ్య చిన్న విరామంతో సాగుతుంది. బెజవాడ విల్సన్ మరియు దీప్తి సుకుమారలతో కూడిన సఫాయి కర్మచారీ ఆందోళన్ బృందం 31 డిసెంబర్ సాయంత్రం 7గం॥ల వేళ నాగపట్నం జిల్లాలోని తరగంచండి గ్రామాన్ని సందర్శించింది.

సునామీ ప్రభావంతో బాగా దెబ్బతిన్న ఆ ప్రాంతంలో శవాల వెలికితీత కార్యక్రమం చీకటి పడడంతో సాధ్యం కాక అప్పుడే ఆపివేశారు. పోలీసులు శవాల్ని లెక్కిస్తూ ఉన్నారు.

2005 జనవరి 1వ తేదీన నాగోల్ రైల్వేస్టేషన్ వెనుక భాగంలో సునామీ జరిగిన 7రోజుల తర్వాత కూడా శవాల పూడ్చివేత కార్యక్రమం కొనసాగుతుంది. ప్రధానంగా రెండు కారణాలతో ఆ శవాల పూడ్చివేత జరుగుతుంది. ఒకటి శవాలను గుర్తించి వాటిని లెక్కించడం రెండు రోగాలు వస్తాయన్న భయంతో. కానీ ఆ కుళ్ళిన దుర్గంధ భరితమైన ఆ శవాల్ని ఎవరు తొలగించగలరు. అక్కడ మరొక వెదుకులాట మొదలయింది. అదేమంటే "ఇక్కడ శవం ఉంది స్వీపర్ ఎక్కడ అంటూ"

పుదుక్కొటై జిల్లా నుండి వచ్చిన ఒక స్వీపర్ శవాలని పూడ్చేందుకు తీసుకొస్తున్నాడు. అక్కడి సఫాయి కర్మచారీలు మాత్రమే కుళ్ళిపోయిన ఆ శవాల్ని తీసుకురావడం పాతిపెట్టడం చూసి యస్.కె.ఎ. బృందం దిగ్భ్రాంతికి లోనైంది. ఆ మున్సిపాలిటీలలో పూర్తికాలం పనిచేస్తున్న మున్సిపల్ పనివాళ్ళని మేము కలిసాము. వారంతా 27 ఉదయం (3.30 గం॥లకు) లారీల్లో నాగపట్నానికి తరలించడ్డారు. అక్కడ చూపుతున్న వివక్షతో వారంతా నిరుత్సాహంగా ఉన్నారు. ఆ శవాల పూడ్చివేత కార్యక్రమంలో ఉన్న ఆ పనివాళ్లకి ఎలాంటి సౌకర్యాలు లేవు. శవాలను ముట్టుకున్న వారికి చేతులు కడుక్కొనేందుకు సబ్బులు ఇవ్వలేదు. ఇవన్నీ ఇంకా కొనసాగుతున్న కులవ్యవస్థ దానిలోని నిచ్చెనమెట్ల విధానపు ఎక్కువ తక్కువల తేడాల కొనసాగింపే అని అర్థమవుతుంది. అంటరానితనం, వివక్షలతో, స్వచ్ఛత, చెడిపోవడం అనే ఆలోచనలతో మన రాజ్యాంగాన్ని ఇంకా ఇసుకలో కప్పివేయడం గానే కనిపిస్తుంది.

*- సఫాయి కర్మచారీ ఆందోళన్*

సునామీ కారణంగా వీరందరి జీవితాలు రోడ్డున పడ్డాయి. వీరు కూడా తమకు సరైన తక్షణ సహాయం అందకపోతే పంపిణీని అడ్డుకుంటామన్నారు.

**తూర్పుగోదావరి**

తూర్పుగోదావరి ప్రాంతంలో పర్యటించిన వారి వివరాల ప్రకారం అక్కడ కూడా ఇలాంటి సమస్యలే ఉన్నాయి అని తెలిసింది. కాకినాడ ప్రాంతంలో మరియు ఆ పరిసర ప్రాంతాల్లో సునామీ ప్రభావం బాగా ఉందని తెలిపారు.

**నెల్లూరు**

నెల్లూరు జిల్లాలో డి.బి.యస్.యు జిల్లా కార్యదర్శి అంజయ్య డిబియస్‌యు డివిజనల్ కార్యదర్శి హుమయూన్ మరియు యానీ నామాల (పునర్నిర్మాన్ ప్రాజెక్ట్)లతో కూడిన మరొక బృందం జనవరి 13 మరియు 14వ తేదీల్లో నెల్లూరు సందర్శించింది. ఆ బృందం జిల్లా కలెక్టర్‌ని, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్‌ని మరియు బాధిత గ్రామాలని సందర్శించడం జరిగింది.

ప్రభుత్వాధికారులు పునరావాస కార్యక్రమాల్ని సంపూర్ణంగా అమలు జరుపుతున్నట్లు వారు తెలిపారు. ఆ జిల్లాలో 12,000 జాలరి కుటుంబాలు ఉన్నాయని తక్షణ పునరావాస చర్యలు 17,000 కుటుంబాలకి అందచేసామని జిల్లా కలెక్టర్ తెలిపాడు. వెలుగు నేతృత్వంలో 10 మండలాల్లోని 108 బాధిత గ్రామాల్లో 66 గ్రామ కమిటీలని ఏర్పాటుచేసి సహాయ చర్యల్ని పర్యవేక్షిస్తున్నట్లు వారు తెలిపారు. జాలర్లతో పాటు దళిత, యానాది కుటుంబాలు కూడా బాధిత పట్టికలోకి చేరిన వైనాన్ని వీరు గమనించడం జరిగింది. మత్తుకూరు గ్రామంలో 50 యానాది కుటుంబాలు రొయ్యలచెరువులపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సునామీ వచ్చిన సమయంలో వీరంతా సముద్రపు ఒడ్డున ఉన్నారు కానీ అదృష్టవశాత్తు ఎవరూ చనిపోలేదు.

కావలి మండలంలోని కొత్త చట్రం ఇందిరానగర్, కారేటివారి పాలెం మరియు పొలదొరువు గ్రామాల్లో ఈ బృందం పర్యటించింది. ఈ నాలుగు గ్రామాల్లో 280 దళిత కుటుంబాలు 35 యానాది కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరందరూ సునామీ కారణంగా జీవనోపాధిని కోల్పోయారు. వాకాడు మండలంలోని చిన్నతోట మరియు నవాబుపేట మండలాల్లోని 35యానాది 80 ముస్లిం 40 దళిత కుటుంబాలు కూడా బాగా నష్టపోయాయి.

ఏదేమైనా అన్ని ప్రాంతాల్లో ప్రజలు 100% జీవనోపాధిని కోల్పోయారు. ప్రభుత్వాధికారులు బెస్త కుటుంబాలకే నష్టం జరిగింది. అనే దృక్పథం నుండి బైటకి వచ్చి మిగిలిన దళిత, ఆదివాసీ, ముస్లింల గురించి కూడా ఆలోచించాలి. సహాయచర్యల్లో వివక్షతలకి దూరంగా ప్రభుత్వాధికారులు ఉండగలగాలి. మిగిలిన అణగారిన వర్గాల ప్రజల జీవనోపాధిని పునరుద్ధరించే క్రమంలో, ఆ వర్గాల పునర్నిర్మాణంలో అప్రమత్తంగా ఉండాలి. ●

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - డిసెంబర్ - 2005

**మహబూబ్‌నగర్ :** 21-12-04న గద్వాల మండలం ముల్కపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ అనే దళిత యువతిపై అదే గ్రామానికి చెందిన రాజేందర్ గౌడ్ అనే వ్యక్తి అత్యాచారం చేసాడు.

**మెదక్ :** 24-12-04న రామాయంపేట పట్టణానికి చెందిన దళిత మైనర్ బాలిక బీడి కార్మికురాలిగా పనిచేస్తుంది. కూరగాయలు తేవడానికి ఇంటినుంచి బయటికి వెళ్ళిన బాలికపై స్థానికులైన నలుగురు యువకులు అత్యాచారం చేసి బాలికవద్ద వున్న వాచ్‌ను, డబ్బులను దోచుకున్నారు.

**మహబూబ్‌నగర్ :** 15-12-04న ఊట్కూరు మండలం అమిన్‌పూర్ గ్రామంలో ఈ నెల 9వ తేదిన కొత్తమాలే బాబు అనే దళితుణ్ణి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యచేసారు. హత్యానంతరం హతుడిభార్య నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసిందని నిందితులు గ్రామస్తులతో కలిసి ఆమెను బెదిరిస్తూ, భర్తను హత్య చేసినట్లుగా ఆమెను ఒప్పుకోమని బెదిరిస్తున్నారు.

**అనంతపురం :** 15-12-04న అమడగూరు మండలం లోకోజుపల్లి గ్రామంలో దండోరా నాయకుడైన గంగులప్ప (45) గ్రామానికి వెళ్తుండగా స్థానిక సర్పంచ్ శివారెడ్డి, అతని బంధువు క్రిష్ణారెడ్డితో పాటు మరో ఏడుగురు కలిసి గంగులప్పపై దాడిచేసి వేట కొడవళ్ళతో నరికి చంపారు. దండోరా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నాడని కక్షతో అగ్రకులస్తులు ఈ హత్య చేసారు.

**ప్రకాశం :** 15-12-04న ఇంకొల్లు మండలం స్టాలిన్‌పేటకు చెందిన సరోజిని అనే దళిత మహిళను అదే గ్రామానికి చెందిన కందిమళ్ళ అంజిబాబు అనే అగ్రకుల వ్యక్తి కులంపేరుతో దూషించి చెప్పుతో కొట్టాడు.

**తూర్పుగోదావరి :** 15-12-04న కపిలేశ్వరపురం మండలం కాలేరుకు చెందిన దళిత మహిళ నాగరత్నంపై ఏలేటి గంగరాజు, బక్కి సత్యదాస్, కొత్తపల్లి భాస్కరరావు, బక్కి ప్రసాద్ కలిసి దాడిచేసి కొట్టారు.

**అనంతపురం :** 16-12-0న చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన నర్సింహులు అనే దళితుడు పొలంలో గొర్రెలు మేపుకుంటుండగా వెంకటేష్ అనే వ్యక్తి నర్సింహులుపై దాడిచేసి కొట్టాడు.

**మహబూబ్‌నగర్ :** 21-12-04న నాగర్‌కర్నూలు మండలం వెంకటాపురం గ్రామంలో దసరా పండుగరోజు శ్రీనివాస్ అనే దళితుడు స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో టెంకాయ కొట్టినందుకు పెత్తందారులైన కె. అల్వాల్‌రెడ్డి, కె. గోపాల్‌రెడ్డి, బక్కిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి మరికొందరు కలిసి శ్రీనివాస్ కుటుంబానికి సాంఘిక బహిష్కరణ విధించారు.

**నిజామాబాద్ :** 20-12-04న నిజామాబాద్ జిల్లా బిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళ రామాయంపేట లోని ఇంద్రాని సీడ్స్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తుంది. పనిముగిసిన తర్వాత ఇంటికి వెళ్తున్న సమయంలో దామరచెరువు గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి ఆమెపై అత్యాచారం చేసి డబ్బులు దోచుకొని పరారయ్యాడు.

**మహబూబ్‌నగర్ :** 22-12-04న గద్వాల మండలం రేకులపల్లి గ్రామంలో కూలిపని చేసుకుంటున్న రాజు అనే దళితుడు తోటి దళితేతర కూలి సద్దిమూట తాకాడన్న నెపంతో అతనిపై దాడిచేసి కొట్టాడు.

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - జనవరి - 2005

**చిత్తూరు :** 12-1-05న తిరుపతిలోని కోర్లగుంటకు చెందిన మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రసాద్ అనే దళితుడిపై అదే పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆనందనాయుడు దాడిచేసి కొట్టాడు.

**వరంగల్ :** 18-1-05న తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలోకి దళితులు వెళ్ళినందుకు గ్రామ దళితేతరులంతా ఆలయాన్ని మూసివేయించి దళితుల పట్ల వివక్ష కొనసాగిస్తున్నారు.

**నల్లగొండ :** 26-1-05న దామరచెర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో దళిత మైనర్ బాలికను గ్రామస్తులంతా కలిసి జోగినిగా మార్చటానికి ప్రయత్నించారు.

**కరీంనగర్ :** 12-1-05న రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్ అటవీ గ్రామానికి చెందిన గిరిజన యువతిపై రాజన్న, మల్లయ్య వెంకటి కలిసి సామూహికంగా అత్యాచారం చేసారు.

**హైదరాబాద్ :** 20-1-05న గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్న కె. చిట్టిబాబు అనే దళిత యువకుడు హాస్టల్‌లో తనరూమ్‌లో చదువుకుంటుండగా పక్కరూములో ఎంసిఏ చదువుతున్న కొంతమంది విద్యార్థులు మద్యం సేవిస్తూ కేకలు వేయటంలో అల్లరి చేయవద్దని చెప్పినందుకు చిట్టిబాబును మరికొందరు దళిత యువకులను కొట్టారు.

**మెదక్ :** 8-1-05న శంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ (30) గంగవ్వ (55) అనే దళిత మహిళలు గత కొన్ని నెలలుగా ఆకలితో బాధపడుతూ మృతిచెందారు.

**మహబూబ్‌నగర్ :** 10-1-05న నర్వమండలం కన్మనూరు గ్రామంలో దళిత మైనర్‌బాలికపై స్థానిక యువకుడు అత్యాచారం చేసి గర్భవతిని చేసాడు. బాలిక తల్లిదండ్రులు నిలదీయటంతో కులపెద్దలు ఆ వ్యక్తి కలిసి బాలికను బలవంతంగా జోగినిగా మార్చారు.

**ఖమ్మం :** 13-1-05న చర్లమండలం చినమిడిసిలేరు గ్రామంలో కోడిపందాలు జరుగుతున్నాయన్న నెపంతో పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి సీతయ్య (28) అనే దళితుణ్ణి పోలీస్‌స్టేషన్‌కు గురిచేయటంతో లాకప్‌లో మృతి చెందాడు.

**నల్గొండ :** 20-1-05న రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం బేగంపేట గ్రామానికి చెందిన రాజు (26) అనే దళితుడు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు (కానిస్టేబుల్) బదిలీ అయ్యాడు. స్థానిక సిబ్బంది, డిఎస్‌పి రాంచంద్రానాయక్‌ల వేధింపులను భరిస్తూ ఉద్యోగంలో కొనసాగుతుండగా అదృశ్యం అయ్యాడు.

**మహబూబ్‌నగర్ :** 11-1-05న నారాయణపేట మండలం నాగర్‌కర్నూలు ఆర్టీసి డిపోలో కండక్టరుగా పనిచేస్తున్న బాలస్వామి అనే దళితుణ్ణి ఆచారి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడు.

**అనంతపురం :** 29-1-05న అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో జరిగిన ఒక హత్యకేసులో విచారణ కోసం ఈశ్వరయ్య (40)ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్ళి చిత్రహింసలకు గురిచేసి హత్యచేసారు.

**గుంటూరు :** 31-1-05న అమరావతి - విజయవాడ రహదారిలో యండ్రాయి గ్రామానికి చెందిన శ్యామల అనే దళిత మహిళపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేసారు.

# మార్త

...✍ **మద్దూరి నగేష్‌బాబు**

ఈ రోజు పొడవటం ఆ పొద్దుకే ఇష్టమైనట్టు లేదు
ఏసు ప్రభువు సావుని గెల్చిన ఆదివారంలా లేదీ ఆదివారం
నిజానికీ రోజు కలువరి గిరి నెత్తుటి స్పర్శకి
భీతిల్లిన దేవాలయపు తెర
నిట్టనిలువునా చినిగిన మహాశుక్రవారంలా ఉంది

ఆదివారం అంటే చర్చి గంటల కంటే ముందే ఆమెని చూడబోతున్నాన్న అదొక ఇది
నాలో రంగురంగున మోగితే
శనివారం రాత్రి కలతనిద్రల పల్లేళ్ళమీంచి
నేనో కలల నవ్వుల నల్లేరుబండినై నడిచొచ్చే రోజు

ఆదివారం అంటే ..... ఆమె కళ్ళ కొమ్మల నుండి
కమ్మటి ప్రేమ పండ్లని నేను గుత్తులు గుత్తులుగా కోసుకునే రోజు

ఆమెలేని ప్రార్థనని మొదలెట్టటం
చివరికి ఆ పాస్టర్ గారికీ నచ్చినట్లుగా లేదు

చెంబు ఇస్త్రీ చేసుకున్న నాగుడ్డలు ప్రతి ఆదివారం లాగే మెరవ్వేం
అర్ధరాత్రే అద్దాల్లా పాలీషు చేసుకున్న నా చెప్పులు
ఎప్పట్లాగే ఎన్నెట్లో ఏరులై పారవేం
నడిపించు నానావంటూ ... అందరూ ప్రార్థనా సముద్రంలోకి వెళ్ళిపోయినా
ఈ ఎదురుచూపులరేవులో
నేనొక్కణ్ణే యిలా దీపం లేని లైట్ హౌస్ నయ్యానేం !
ఓ నా ద్రాక్షావల్లీ మార్తా .... నా ఏకాకితనపు అమాసచీకట్లో
అతి పరిశుద్ధ స్థలపు కొవ్వొత్తివై వెలిగే నిన్ను
ఏ అనారోగ్యపు సుడిగాలి కమ్మేసింది?
శ్రమల దినాల్లో అందరూ ఉమ్మడి ఉపవాసప్రార్థనలు చేసేవేళ
మన కళ్ళు కలుసుకున్న సంగతి ఆ పాదిరిగారికి తెలిసి
మనం విడిపోవటం కోసం ఎడతెగని ప్రార్థనలు గాని చెయ్యలేదుకదా
ఆంధ్ర క్రైస్తవ కీర్తన బౌండు పుస్తకంలో
నా హృదయాన్ని ఉత్తరంగా నీకందించిన సంగతి
ఆ దేవుడు పసిగట్టి మునల్నిలా శపించలేదు కదా !

బలురక్కసి చెట్లలో వల్లీపుష్పమా
బండసందులలో పావురమా !
మార్తా !
నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించుమన్న దేవుడే
నాకు మాలరక్షకుడై నీకు మాదిగకరుణామయుడై
మనమధ్యే పరిశుద్ధ పర్వతశ్రేణిగా అడ్డుపడితే
'వింటు పరమందు' అని పాడాల్సిన పెద్దల గొంతుల్లో
రెండూ మూడు తేడాల కులంగుమ్మడి కాయలు అడ్డుపడితే
చివరికి నీ ప్రేమ దేవుణ్ణే ధిక్కరించిందా మార్తా !
రొట్టె ద్రాక్షారసాల రొటీన్ ఆరాధనల్ని రోషంగా బహిష్కరించిందా!
అయ్యో, బెత్లహేము పశులపాకపై నిలచిన నక్షత్రం లాంటి నీ ముఖంలో
దిగులు మబ్బే మేటేస్తే ఈ వెర్రి ప్రపంచం గుడ్డిదయిపోదా .... !
బెతస్థ కోనేళ్ళలాంటి నీ కళ్ళే పొంగిపొర్లితే
ఈ వెర్రి భూగోళం స్వస్థతే లేని రోగంలో మునిగిపోదా !

ఓనా అరుంధతీ - రా !
గాయాల మధ్య కూడా గోడలు కట్టిన ఈ కులం గుండెలపై నిలబడి నాకు దండెయ్యి నువ్వు
మాలపల్లె ఉంగరాన్ని నేను మాదిగగూడెం వేలికి తొడుగుతా
ఇక ప్రతి రోజూ ఆదివారమయ్యే కొత్త కేలండర్లోంచి
మనబిడ్డ కొత్త 'వాడై' తిరగబడతాడు.

*(జనవరి 10, 2005న చనిపోయిన* ***దళిత కవి మద్దూరి నగేష్‌బాబు*** *స్మృతిలో.....)*


**మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.**

**సాక్షి**

**హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.**
**ఇం.నెం. 10-1-564, టి.ఐ.టి., బ్లాక్ - 50.**
**వెస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**

**ఫోన్ : 040 - 27801368**
**ఫ్యాక్స్ : 040 - 27715086**
**ఇ-మెయిల్ :** Sakshi_ap@satyam.net.in
**వెబ్‌సైట్ :** www.sakshiap.org


**BOOK - POST**

Printed Matter

To


Published by Dr. S.D.J.M Prasad Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.